AL - HILAL


నెలవంక

మాస పత్రిక

Vol 5,Issue: 18 March - 2008

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)

సృష్టికర్త ఒక్కడే. రెండవవాడు లేడు.
లేనే లేడు. ఎంత మాత్రం లేడు.



గ్రంథం కల ఓ ప్రజలారా!
"మీరూ మేమూ మధ్య సమానంగా ఉన్న ఒక విషయం వైపునకు రండి.
అదేమిటంటే: మనం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ పూజించరాదు.
ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించరాదు.
అల్లాహ్‌ వదలి మనలో ఎవరూ ఇతరులను ప్రభువుగా చేసుకోరాదు."
(ఆలి ఇమ్రాన్ - 64)

IPC

గల్ఫ్ నుండి వెలువడే ఏకైక తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక

NELAVANKA
(Al-Hilal)
Monthly

CHIEF PATRON
Muhd. Ismail Al-Ansari

CHIEF EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk. Abdus Salam Omeri
Tahera Begum

Design
Noushad Zainulabdeen

PUBLISHED BY
Islam Presentation committee
Kuwait

PHONES
2444116 , 2444117
Extns :
110 Azeezur Rahman
151 Mujahid khan Omeri

FAX
2400057

EMAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O. Box-1613
Safat-13017, KUWAIT





పోటెత్తిన జన సముద్రం 4

6
మారాలి ప్రవర్తన

13
స్థిత ప్రజ్ఞుడు





17
విజేతలకు బహుమతులు

ఈ సంచికలో....

రిటర్న్ టికెట్	2	లజ్జ	11
మత్తు వదిలింది	3	సమస్యలకు సమాధానం ఇస్లాం	12
ఖురైష్ పార్లమెంటు	8	పేదలు పుణ్యార్జనలో అగ్రగాములే	14
హజ్రత్ సఫియ్యా (ర.అన్హా)	9	మానవ హక్కులు	15
ప్రళయ గర్జన	10	మధనపడే మనసు	18

❖ تذكرة العودة (فكر الآخرة) ❖ مشكلات الشباب وعلاجها ❖ أهوال القيامة
❖ الداعية المعجزالمعاصر (د. ذاكر نايك) ❖ نشيدة في التوحيد (اعرف الحق) . . . . وزهق الباطل
❖ دارالندوة (تلخيص الرحيق المختوم) ❖ الحياء من الإيمان ❖ أسئلة مهتدية وإجابتها ❖ أنشطة اللجنة
❖ تعالوا إلى كلمة سواء بيننا بينكم . . . . (ندوة إسلامية) ❖ السيد ة صفية بنت حيَ رضى الله عنها
❖ الإسلام دين الرحمة . . . ليس بالزحمة ❖ حقوق الإنسان في الإسلام ❖ توبة نصوح

PAGE 1-20.pdf 3/12/08 8:39:08 PM



నెలవంక ఉత్తరాలు


మా హజ్జ్ యాత్ర

అల్లాహ్ ఆర్థిక స్థోమత గల ముస్లిం స్త్రీ పురుషులపై హజ్జ్‌ను విధిగా చేశాడు. మాకు అంత స్థోమత లేకపోయినా ఐ.పి.సి వారు ఈ అవకాశాన్ని ఇచ్చి ఎంతో భద్రతతో ఈ యాత్రను కొనసాగించే ఏర్పాట్లు చేసినందుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎప్పటిలాగానే ఈ ఏడు 13వ హజ్జ్ ప్రయాణం 86 మంది సోదరీ సోదరులతో ఎంతో భక్తి విశ్వాసాలతో ముగిసింది. అల్‌హందులిల్లాహ్. 07/12/2007 రాత్రి ఫహాహీల్ బ్రాంచ్ వారు ఎంతో గౌరవమర్యాదలతో, శాంత వచనాలతో మమ్మల్ని సాగనంపారు.

మక్కా చేరి కాబతుల్లాహ్‌ను చూడగానే ఎనలేని భయభక్తులు తమ హృదయాలలో జనించాయని కొంత మంది హాజీలు వ్యక్తం చేశారు. అక్కడ విశాలమైన మస్జిద్ ఆవరణంలో ఎత్తైన మీనార్ల నుండి నమాజులో ఖుర్‌ఆన్ పారాయణం జరుగుతుంటే నిజంగా ఇది దివి నుండి భువికి వినిపిస్తోందన్న అనుభూతి కలుగుతుంది. మీనాలో బస, అరఫాత్ మైదానంలో కన్నీటితో సుదీర్ఘమైన ప్రార్థనలు, ప్రపంచ దేశ సమూహాలతో కాబాతుల్లాహ్ దగ్గర తవాఫ్ చేయటం, సఫా-మర్వాల మధ్య సయీ, న్యూ ముస్లింలను అబ్బుర పర్చాయి. వారి విశ్వాసాన్ని మరింత పెంచసాగాయి. ఈ భాగ్యం ప్రసాదించబడిన మనం చాలా అదృష్టవంతులమని అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకోసాగారు.

దాయియా రెహానా గారు స్త్రీలకు కొన్ని చిరు ప్రశ్నలతో క్విజ్‌ను నిర్వహించి తదనంతరం బహుమతులు పదానం చేశారు. మా అందరి హజ్ అల్లాహ్ స్వీకరించి మమ్మల్ని పునీతుల్ని చేయాలని అల్లాహ్‌ను మరీ మరీ ప్రార్థించుచున్నాను. (ఆమీన్)

– మర్యం (రౌదా)



'నెలవంక' లో నా మనసుకు హత్తుకున్న విషయాలు మూడు

(1) **'నెలవంక'** ఇస్లాంలో ఉన్న అతి సున్నితమైన ధర్మ సందేహాలను ఎంతో వివరంగా తెలియపరుస్తున్నది.

(2) ఇస్లాం పట్ల మూఢనమ్మకాలు ఉన్న ఎంతో మంది ముస్లిమేతర సోదరులకు అతి సులభంగా ఇస్లాం పరిచయం చేయడం నాకు ఎంతో నచ్చిన విషయం. దీనివల్ల నా లాంటి కొత్త ముస్లిములకు ఎంతో మార్గదర్శకం లభిస్తుంది.

(3) ఏ విషయమైనా-అది సంఘ వ్యతిరేకంగా ఉంటే **'నెలవంక'** దాన్ని సూటిగా ఖండిస్తుంది! తద్వారా తనవంతు బాధ్యత నిర్వర్తిస్తుంది! అందుకే **'నెలవంక'** అంటే నాకు ఎంతో ఇష్టం!

-అబ్దుర్రహ్మాన్ (కువైట్)

కలం ద్వారా మనసును కదిలించిన వ్యాసం

నేను ఇస్లాం స్వీకరించి నాలుగేళ్ళు అయినది. నెలవంక డిసెంబరు సంచికలోని అజీజుర్రహ్మాన్ గారి "ఏకత్వానికి ప్రతి రూపం" వ్యాసం చదివేటప్పుడు కన్నీటిమయమైనది నా హృదయం. రెండవ పేరులోని విషయం: అది "అందరి అధరాలు ఆలాపించే స్తుతి గీతిక" చదువుతున్నప్పుడు ఏకధాటిగా నా కళ్ళు వర్షించాయి. ఆ వాక్యం నా మనసును కదిగిందా అన్న భావన నాలో కలిగింది.

అజీజుర్రహ్మాన్ గారు ఇలాంటి ఎన్నో వ్యాసాలు మాకందించాలని, అల్లాహ్ ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు అద్భుత విషయాలను మాకందించే శక్తిని ప్రసాదించాలని అల్లాహ్‌కు దువా చేస్తున్నాము. ఆమీన్-యా రబ్బల్ ఆలమీన్.

-ఆయిషా (ఉమా మహేశ్వరి)
రౌదా

మానవతకు మరో పేరు

మానవతకు మరో పేరు ఇస్లాం. మంచి హృదయాల నేస్తం ఇస్లాం. ఆనంద బాసటగా నిలిచే ఐ.పి.సి పుస్తకాలు హృదయాలను పులకింపజేసే **నెలవంక**- మదిలో మెదిలే మంచి ముత్యాలు, అంచనాలకందని కమ్మని రచనలు, ఖుర్‌ఆన్ ఇచ్చిన దివ్య సందేశాలు, మల్లె పూల లాంటి మాటల ముత్యాలతో నవ ముస్లింలను తీర్చిదిద్దుతుంది.నవ సమాజానికి కొత్త వెలుగునిస్తుంది. రాజకీయ ప్రేరణతో ముందుకు వస్తుంది. రమణీయ కాంతులను వెదజల్లుతోంది.

-నవ ముస్లిం సోదరుడు
సులైమాన్ (హసావియా)



లజ్జ



మూలం: హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.అలై)
అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

● **హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వ్రీడ (లజ్జ) విశ్వాసంలో అంతర్భాగం."**

(బుఖారీ, ముస్లిం)

సారాంశం

అరబీలో **'హయా'** అనే పదం వచ్చింది. **'హయా'** అంటే అసలు లజ్జ, వ్రీడ, సిగ్గు, బిడియం అన్న అర్థాలు వస్తాయి. లజ్జ అనేది స్వాభావికమైనది. ఈ లజ్జా భావమే గనక మనిషిలో లేకపోతే అతను తన మర్మస్థానాలను కూడా రక్షించుకోడు. లజ్జ లేని వానిలో ఆత్మాభిమానం కూడా ఉండదు. లజ్జ లేనివాడు సమాజం విధించే కట్టుబాట్లను కూడా ఖాతరు చేయడు. లజ్జ మానవత్వానికి ప్రతిరూపం. అందుకే **'లజ్జ'** ఈమాన్ (విశ్వాసం)లో అంతర్భాగంగా ఖరారు చేయబడింది ఈ హదీసులో.

లజ్జా గుణం మనిషిలో భీతిని, బాధ్యతాభావాన్ని పెంపొందిస్తుంది. లజ్జ సౌశీల్యానికి, పారిశుద్ధ్యానికి సోపానం. లజ్జను మరచినవాడు చంచలుడైపోతాడు. లజ్జా విహీనుడైనవాడు నిర్భయంగా సిగ్గుమాలిన పనులకు పూనుకుంటాడు. అందుకే సంస్కృతంలో అనబడింది– "కామా తురాణాం న భయం న లజ్జ" అని!

హజ్రత్ అబూ మస్‌వూద్(రజి) కథనం: దైవప్రవక్త (స) ప్రబోధనం– "తొలి దైవదౌత్య పరంపరలో నుంచి జనులకు ప్రాప్తించిన వాటిలో 'సిగ్గు, షరము విడిచేసినప్పుడు నువ్వు ఏం చేసుకున్నా అడ్డుండదు' అన్న ప్రబోధన కూడా ఉంది." (బుఖారీ)

సారాంశం

'తొలి దైవదౌత్య పరంపర' అంటే భావం మహాప్రవక్త ముహమ్మద్(స) కు పూర్వం వచ్చిన దైవప్రవక్త (అలైహిముస్సలాం)లపై అవతరించిన దైవవాణి మరియు షరీయతు. అప్పటి షరీయతుల్లోని కొన్ని అంశాలు రద్దు కాలేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. వాటిలో ఒకటి పై హదీసులోని ప్రబోధనం. సిగ్గు, బిడియం ఉన్నవాడు పాపానికి ఒడిగట్టేప్పుడు ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తాడు. ఒకవేళ క్షణికావేశంలో తప్పు చేసినా, తరువాత దాన్ని తలచుకుని సిగ్గుతో కుమిలిపోతాడు.

కాని మనసులో సిగ్గు, షరము అసలేమీ లేనివాడు ఎవరినీ లెక్క చేయడు. సమాజం తనను గురించి ఏమనుకున్నా, తోటివారు తనను ఎంతగా ఈసడించుకున్నా నిక్షేపంగా ఉంటాడు. అందుకే ఈ నేపథ్యంలో కొంతమంది తత్వవేత్తలు ఇలా అన్నారు– ఏదైనా పనికి ఉపక్రమించినపుడు దాని కీడును కూడా ఎంచండి, దాని ఉచితానుచితాలను బాగా బేరీజు వేయండి. దానికి మీ మనస్సాక్షి నుండి 'పచ్చని సంకేతం' లభిస్తే సరి! లేనట్లయితే ఆ పనిని మానివేయండి.

● **హజ్రత్ అబూహురైరా(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: "దైవ సన్నిధిలో బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికన్నా ఎక్కువ ప్రియతముడు, ప్రయోజనకుడును. ఆ మాటకువస్తే ప్రతి విశ్వాసిలోనూ మేలు, మంచితనం ఉంటాయి. నీకు ప్రయోజనకరమైన దాన్ని నీవు ఆశించటంలో తప్పు లేదు. (అయితే) కేవలం దైవ సహాయాన్ని అర్థించు! అశక్తుడవై, నిస్సహాయుడవై కూర్చోకు. నీకు ఏదన్నా ప్రాప్తించినప్పుడు, 'నేను ఫలానా పనిని ఇలా చేసే బదులు ఇలా చేసివుంటే నాకు మరిన్ని లాభాలు చేకూరి ఉండేవి' అని అనకండి. దీనికి బదులు 'అల్లాహ్ నా కొరకు తలచినదే అయింది' అని అనండి. ఎందుకంటే 'అయితే... గీతే...' అనే ఊహాగానాల వల్ల షైతాన్ ఆగడాలకు ద్వారం తెరచుకుంటుంది." (ముస్లిం)**

సారాంశం

'అయితే...గీతే...' లాంటి ఊహాగానాలకు తెరదించమని ఈ హదీసులో అనబడింది. కాని మరికొన్ని హదీసుల ద్వారా ఇలాంటి ఆత్మావలోకనానికి అవకాశం ఉందని తెలుస్తోంది. అందుకే ఇలాంటి ఊహాగానాలను 'నిషిద్ధం' అని అనే బదులు 'అయిష్టకరం' అనటం సబబుగా ఉంటుంది. కాని ఇలాంటి అంచనాలు వేసుకునే సమయంలో సంకల్పం నిష్కల్మషంగా ఉండాలని పండితులు చెబుతున్నారు.

బలహీనుడైన విశ్వాసికన్నా బలశాలి అయిన విశ్వాసి దేవుని దృష్టిలో ప్రియతముడు అని అనబడటం గమనార్హమైన విషయం. బలవంతుడైన వ్యక్తి ధర్మరక్షణ కోసం ఎక్కువ సేవలు అందిస్తాడు. అనారోగ్యంతో సతమతమయ్యే వ్యక్తికన్నా ఆరోగ్యవంతుడైన వాడు తన్ను తాను రక్షించుకోవటంతో పాటు, ఇతరులను కూడా రక్షిస్తాడు. కాని మానవుడు ఎంత బలశాలి అయినప్పటికీ దైవ సహాయం లేనిదే అతడేమీ చేయజాలడన్న సత్యాన్ని ఈ సందర్భంగా విస్మరించరాదు. అందుకే సర్వకాల సర్వావస్థల్లో సహాయం కోసం సర్వోన్నతుడైన దైవాన్ని మాత్రమే వేడుకుంటూ, ఆయన పైన్నే భారం మోపి మరీ సాధన చేయాలి.

PAGE 10-11.pdf 3/12/08 8:57:29 PM

ఖుర్‌ఆన్ పాఠం



ప్రళయ గర్జన - 1



-అబ్దుల్ ఖాదిర్ ఉమ్రి

మహోన్నతుడు, సర్వశక్తిమంతుడు అయిన విశ్వప్రభువు - అల్లాహ్- సెలవిచ్చాడు:

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహానికి భయపడండి. యదార్థం ఏమిటంటే ప్రళయం నాటి భూకంపం మహా (భయంకరమైన) విషయం. దానిని మీరు చూచినప్పుడు దాని స్థితి ఎలా ఉంటుందంటే; పాలు పట్టే ప్రతి స్త్రీ పాలు త్రాగే తన పాపను మరచిపోతుంది. ప్రతి గర్భిణీ యొక్క గర్భం పడిపోతుంది. ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు. వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షే అంత తీవ్రంగా ఉంటుంది. (అల్ హజ్: 1,2)

మహాశయులారా!

"ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్యపటాటోపం, ప్రగల్భాలు పలకటం, సిరి సంతానాదుల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు" అని అల్లాహ్ తన దివ్యగ్రంథంలో సూటిగా, స్పష్టంగా చెప్పనే చెప్పాడు. అలాగే మన విశ్వాసం ఏమిటంటే; ఈ ప్రపంచ జీవితం తాత్కాలికమయింది. ఈ తాత్కాలిక ప్రపంచం మానవుని కోసం పరీక్షా స్థలం. అసలు జీవితం పరలోక జీవితం. అది మరణానంతరమే ప్రారంభమవుతుంది.

విశ్వప్రభువు ఏదో ఒక రోజు ఈ విశ్వాన్ని, ఇందులో ఉన్న సకల చరాచర సృష్టిని పూర్తిగా నిర్మూలిస్తాడు. అదే ప్రళయం.

సకల సృష్టిని నిర్మూలించిన తరువాత మానవులందరినీ తిరిగి బ్రతికిస్తాడు. అందరూ అల్లాహ్ న్యాయ స్థానంలో హాజరవుతారు. దాన్ని 'హష్ర్' అంటారు.

మానవులంతా ఇహలోకంలో చేసిన సత్కార్యాలు, దుష్కార్యాలు అన్నీ అల్లాహ్ సమక్షంలో ఆయన త్రాసులో తూచబడతాయి. ఎవరి సత్కార్యాల పళ్లాలైతే బరువుగా ఉంటాయో వారికి మోక్షం ప్రాప్తమవుతుంది. వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. మరెవరి దుష్కార్యాల పళ్లాలైతే క్రిందికి వంగిపోతాయో వారు శిక్షించబడతారు. వారు నరకానికి పంపబడతారు.

ప్రళయం నిశ్చయంగా సంభవిస్తుంది. దాని సంభవాన్ని ఎవరూ తిరస్కరించలేరు. అయితే అది ఎప్పుడు సంభవిస్తుంది? ఆ విషయం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. కాని అంతిమ దైవప్రవక్త(స) ప్రవచనాల ప్రకారం తెలిసేదేమంటే; ప్రళయం శుక్రవారం నాడు సంభవిస్తుంది. అందువల్లనే శుక్రవారం వచ్చిందంటే చాలు దైవదూతలు, భూమ్యాకాశాలు, సముద్రాలు, పర్వతాలు సమస్తం అది ఎక్కడ వచ్చి పడుతుందోనన్న ఆలోచనతో వణికిపోతుంటాయి.

ప్రళయానికి ముందు ధర్మం మంట కలిసి పోతుంది. అధర్మం రాజ్యమేలుతుంది. పాపాలు ఎక్కువైపోతాయి. నీతికి, నిజాయితీకి, న్యాయానికి నిలువ నీడలేకుండా పోతుంది. జనులు ప్రాపంచిక వ్యామోహంలో పడిపోతారు. స్వల్ప ప్రయోజనాల కోసం రక్తపాతం సృష్టిస్తారు. కామాంధులు అశ్లీల చేష్టల్లో మునిగి తేలుతూ పశువుల్లా విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. సంతానం తల్లిదండ్రులను ఖాతరు చేయదు. భర్త తన భార్యకు విధేయుడైపోతాడు. మసీదుల్లో అలజడి ఎక్కువైపోతుంది. అత్యంత నీచులు, నేరస్తులు నాయకులై కూర్చుంటారు. జనులు మత్తు పదార్థాలను బహిరంగంగా వాడుతారు. ప్రజలు దుర్మార్గులకు భయపడి వారిని గౌరవిస్తారు.

ప్రళయం; అది మహా ఉపద్రవం. విశ్వప్రభువైన అల్లాహ్ ఆజ్ఞ ఇవ్వడమే ఆలస్యం దైవదూత ఇస్రాఫీల్(అ) శంఖం పూరిస్తారు. అంతే ఆకాశం బ్రద్దలవుతుంది. సూర్యుడు నిస్తేజమైపోతాడు. నక్షత్రాలు చెదిరి కాంతి విహీనమైపోతాయి. చంద్రుడు గురుత్వాకర్షణ శక్తి కోల్పోయి సూర్యునికి అతుక్కుపోతాడు. గ్రహాలు తమ తమ నిర్ణీత కక్ష్యలు వదలి బంతుల్లాగా అటూ ఇటూ తిరుగుతూ చివరికి అణుబాంబుల్లా పేలిపోతాయి.

భూమి తన పూర్తి తీవ్రతతో ఊపివేయబడుతుంది. అది తన లోపల ఉన్న మొత్తం భారాన్ని ఖజానాలను తీసి బయట పడవేస్తుంది. అప్పుడు మనిషి అంటాడు **"అరె! దీనికేమయింది ఈ రోజు"** అని.

సముద్రాలు ప్రజ్వలింపజేయబడుతాయి. పర్వతాలు తమ పట్టును కోల్పోయి ఏకిన రంగురంగుల దూది పింజాల మాదిరిగా మారి తేలియాడుతాయి.

ఆ రోజు తీవ్ర భయాందోళనతో జనులు కనుగుడ్లు తేలేసి, తల పైకెత్తి అటూ ఇటూ పరుగిడుతూ ఉంటారు. పైచూపులు పైనే ఉండిపోతాయి. గుండెలు గొంతులదాకా వచ్చి ఉంటాయి.

ఆ భీకర రోజున ప్రతి మనిషీ తన ఆప్తుల్ని, రక్త సంబంధీకుల్ని సయితం మరచిపోతాడు. చివరికి వెచ్చని వడిలో తన చంటిబిడ్డకు పాలిస్తున్న తల్లి కూడా తన పసిబిడ్డను వదలి పరుగెత్తుతుంది. ప్రళయ బీభత్సం ఎంత తీవ్రంగా ఉంటుందంటే ప్రతి గర్భిణీ గర్భం పడిపోతుంది. ఆ రోజు ప్రతి మనిషి తన తల్లిదండ్రుల్ని, సోదరుల్ని భార్యాపిల్లలను వారి మానాన వదిలేసి పరుగుతీస్తాడు. 'నేనెక్కడికి పారిపోవాలి?' అనంటాడు. అతడు ఎక్కడికి పారిపోతాడు!? అతనికి రక్షణ ఎక్కడ ఉంటుంది? ఆ రోజు క్రూర జంతువులు సయితం తీవ్రమైన భయాందోళనలతో ఒక చోట గుమిగూడుతాయి.

ఇలా ప్రళయ మహోపద్రవం వల్ల విశ్వం రూపు రేఖలు పూర్తిగా మారిపోతాయి. యావత్తు జీవరాసులు తమ ఉనికి కోల్పోతాయి. విశ్వప్రభువు- అయిన అల్లాహ్-తప్ప మరెవరూ మిగిలి ఉండరు. అప్పుడు అల్లాహ్ అంటాడు; "నేనే ఏకైక దేవుడ్ని, నేనే చక్రవర్తిని. నేనే సర్వశక్తి మంతుడ్ని, నేనే సమస్త వైభవాలు గల మహోన్నతుడ్ని. ప్రపంచవాసులైన ఆ చక్రవర్తులు ఎక్కడున్నారు? ఏరీ ఆ నియంతలు? ఏమయ్యారు ఆ అహంకారులు?"

స్థిత ప్రజ్ఞుడు డా.జాకిర్ నాయక్



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

మొక్క వోని సాహసానికి మారుపేరతను. పట్టుదలకు ప్రతిరూపమతను. తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏ దశలోనూ రాజీపడని ధర్మ నిష్ఠాపరుడతను. ఇస్లాం ధర్మానికి మూల సరోవరాలైన ఖుర్‌ఆన్ హదీసులను సమకాలీన సమస్యలకు అన్వయిస్తూ నవతరానికి స్ఫూర్తినిచ్చిన మహా మేధావి ఆయన. వజ్ర సంకల్పి. లక్ష్య సాధన కోసం అలుపెరగని దీక్షాదక్షతలతో ముందుకు దూసుకుపోయిన కార్యశూరుడు. సూటిగా మాట్లాడే మహావక్త. ఆయనే జగమెరిగిన డా. జాకిర్ అబ్దుల్ కరీం నాయక్.

43 ఏండ్ల ఈ మరాఠీ డాక్టరు కావాలనుకున్నాడు. కాని ధర్మసేవకునిగా రాణిస్తున్నాడు. అహ్మద్ దీదాత్ ప్రసంగాలతో స్ఫూర్తి చెంది వివిధ మతధర్మాల కంపారెటివ్ స్టడీస్‌కి పూనుకున్నాడు. అంతే. 20 ఏళ్ల ఈ ప్రయాణంలో ఎన్నడూ వెనక్కి తిరిగి చూడలేదు. అలుపెరగని పరిశోధకుడుగా పరిశ్రమించాడు. తాను ఇప్పటికీ ఒక విద్యార్థినేనని వినయంగా చెప్పుకుంటాడు. "మానవ శరీరాలకు వైద్యం చేయాలనుకున్నాను. కాని దేవుడు నన్ను మానవ హృదయాల వైద్యునిగా చేశాడు" అంటాడు. తాను ఫండమెంటలిస్టునేనంటాడు. అయితే తాను నమ్మే మతధర్మాన్ని నిజాయితీగా అవలంబించే విషయంలో ఫండమెంటలిస్టునంటాడు.

వివిధ మతాలలో గల దైవభావనపై గంటల తరబడి మాట్లాడతాడు. ఎన్నో జఠిల ప్రశ్నలకు సూటిగా సమాధానాలిస్తాడు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ఆధారంగా దేవుని ఏకత్వాన్ని నిరూపిస్తాడు. బైబిల్‌లో 'త్రిత్వం' లేనే లేదని ఘంటాపథంగా వాదిస్తాడు. గురుగ్రంథ్‌ను ఉదాహరిస్తూ ఏకేశ్వరోపాసనను రూఢీ చేస్తాడు. అందుకే అతని సభలకు అన్ని మతాలవారు, మతాన్ని నమ్మనివారు కూడా ఆసక్తితో తరలివస్తారు.

దైవదాసులను దైవారాధన వైపునకు పిలిచేందుకు అతడు లోకమంతా చుట్టివచ్చాడు. విశ్వవిఖ్యాత మతాచార్యులతో డిబేట్లు జరిపాడు. తన సందేశాన్ని చాటిచెప్పటానికి 'పీస్ టీవి' ఛానల్‌ని నెలకొల్పాడు. మోడరన్ ఎడ్యుకేషన్‌తో ధార్మిక విద్యను కూడా మేళవిస్తూ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో విద్యాపీఠాలు స్థాపించాడు.

అవును డా. జాకిర్ నాయక్ నవ తరానికి స్ఫూర్తినిచ్చే మేధావి. మహావక్త. గొప్ప దాయి. దావా (దైవసందేశ పరిచయ) ప్రక్రియకు వినూత్న ఒరవడినిచ్చిన ప్రజ్ఞాశీలి. కారుణ్య ప్రభువు ఈయన హృదయాన్ని మరింతగా విప్పాలని, ఈయన సేవలకు ఆమోదముద్ర వేయాలని, ఈయన చేత మరిన్ని గొప్ప కార్యాలు ఆవిష్కరింపజేయాలని నెలవంక సిబ్బంది నిండు హృదయంతో ప్రార్థిస్తోంది.

PAGE 12-13.pdf 3/12/08 9:18:18 PM

ఇస్లాం
మానవ సమస్యలకు సమాధానం



"ఇస్లాం ఓ నిత్య నూతన జీవన విధానం. 14 శతాబ్దాల క్రితం అది ఏ విధంగా మానవతను దానవత్వం నుంచి రక్షించిందో అదే విధంగా అది నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రబలి ఉన్న అశాంతి, అలజడుల నుంచి మానవ సముదాయాలను రక్షిస్తుంది. అంతిమ దైవగ్రంథమైన ఖుర్‌ఆన్ సర్వ రోగనివారిణి. ఎటువంటి ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు గురికాకుండా స్వచ్ఛంగా, సురక్షితంగా ఉన్న ఏకైక గ్రంథరాజం దివ్యఖుర్‌ఆన్. అది మానవులందరికీ సన్మార్గం చూపే దివ్యవాణి" అని ప్రఖ్యాత ఇస్లామీయ వక్త డా.జాకిర్ నాయక్ వక్కాణించారు.

ఇస్లాం ప్రజెంటేషన్ కమిటి (IPC) ఆధ్వర్యంలో ఇండియన్ ముస్లిం అసోసియేషన్ (IMA), కేరళ ఇస్లామిక్ గ్రూప్ (KIG) వారు సంయుక్తంగా నిర్వహించిన ధార్మిక సదస్సులనుద్దేశించి డా. జాకిర్ నాయక్ ప్రసంగిస్తూ, మానవ జీవితంతో ముడిపడి ఉన్న పెక్కు అంశాలను విశ్లేషించారు. ఇస్లాం మానవ సమస్యలను పరిష్కరించడానికి వచ్చిన జీవన ధర్మమే గాని, సమస్యల్లోకి నెట్టివేయటానికి వచ్చిన ధర్మం కాదని ఆయన ఉద్ఘాటించారు.

మానవులు తమను సృష్టించిన సృష్టికర్తను నిజాయితీగా అంగీకరించి, ఆయన ఒక్కనినే కొలచిన నాడు విశ్వజనీన సోదరభావం వెల్లివిరుస్తుందని ఉద్ఘాటించారు. పాక్షిక, సాపేక్షిక విషయాలను ప్రక్కనపెట్టి, ఒక్కడైన నిజదైవాన్ని ఆరాధించాలని, ఆయన దైవత్వంలో సహవర్తులుగా ఎవరినీ చేర్చరాదని ఆయన పిలుపు ఇచ్చారు.

దేవుడు విధించిన హద్దులను గౌరవించి, వాటిని కాపాడినప్పుడే మానవ సముదాయాలలో శాంతి సుస్థిరత నెలకొంటుందని ఆయన వక్కాణించారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో పెచ్చరిల్లుతున్న దొంగతనాలు, లూటీలు, మానభంగాలను ఆయన ఉదాహరిస్తూ, ఇస్లాం ప్రతిపాదించిన శిక్షలను అమలు పరిస్తే ఎక్కడైనా నేరాలు గణనీయంగా తగ్గిపోతాయని చెప్పారు.

వేదాలు ఉపనిషత్తులలో ఉన్న దేవుని ఏకత్వపు భావనను ప్రజాబాహుళ్యానికి విడమరచి చెబితే ఎన్నో చిక్కుముడులు విచ్చుకుంటాయని డా.జాకిర్ నాయక్ అభిప్రాయపడ్డారు.

బైబిల్‌లో ఒక్క చోట కూడా ఏసుక్రీస్తు తనను దేవునిగా చెప్పుకున్నట్లు గానీ, తనను ఆరాధించమని బోధించినట్లుగా గానీ లేదని ఆయన గుర్తు చేశారు.

–'నెలవంక' ప్రతినిధి

దేవుడు ఒకే ఒక్కడు. రెండవ వాడు లేడు. లేనే లేడు. ఎంతమాత్రం లేడు.

మానవ హక్కులు : ఇస్లాం - 2



- అబూ అతీఖ్

ఈ మనిషి కూడా మహా విచిత్రమైనవాడు. అతను సూర్యచంద్రుల అందాలను చూసి ముగ్ధుడైపోతుంటాడు. మనిషి అందాలను గులాబీలతో, కలువపూలతో పోలుస్తుంటాడు. అందమైన లేడి కళ్ళు అతన్ని ఆకట్టుకుంటాయి. ఉవ్వెత్తున లేచే కడలి తరంగాలను చూసి ఆనందంతో పరవశించిపోతాడు. ప్రవహించే నదీ నదాలను చూసి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతుంటాడు - ఇవన్నీ అతని సంకుచిత దృష్టికీ, పరిమిత పరిధికి ప్రతీకలనే అనాలి. వాస్తవానికి సృష్టికర్త మానవ సృష్టిలో పొందుపరచిన అందాల ముందు ఇవి దేనికీ పనికిరావు. మనిషిని నఖశిఖపర్యంతం తీర్చి దిద్దిన తీరు జగతిలో మరెక్కడా, ఏ ప్రాణిలోనూ, ఏ సృష్టి ప్రక్రియలోనూ కానరాదు. అందుకేనేమో సృష్టికర్త ఈ సృజనను గురించి ప్రస్తావించకుండా ఉండలేకపోయాడు.

1. " మేము మానవుణ్ణి అద్భుతమైన ఆకృతి లో సృజించాము ". (అత్తీన్ : 4)

2. " ఓ మానవుడా! పరమ దాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసిందయ్యా? చూడబోతే నిన్ను సృష్టించినవాడూ, ఏ లోపమూ లేకుండా నిన్ను తీర్చిదిద్దినవాడూ, నిన్ను తగినరీతిలో పొందికగా రూపొందించినవాడూ, తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలచిన వాడూ ఆయనే కదయ్యా?!"

(ఇన్‌ఫితార్ : 6-8)

గౌరవోన్నతులకు మూలం

మానవతా మర్యాదకు అన్నిటికన్నా గొప్ప నిదర్శనం దేవుని ఏకత్వం (తౌహీద్). ఒక వైపు మనిషిని సర్వోన్నతుడైన దేవుని ఎదుట తలవంచేలా చేస్తూనే, మరో వైపు సమస్త ప్రాణుల నుంచి, ఊడిగాల నుంచి అతన్ని సర్వ స్వతంత్రుణ్ణి చేస్తుంది ఈ ఏకేశ్వరోపాసన. ఇతరులముందు మోకరిల్లవలసిన, దీనంగా మొరపెట్టుకోవలసిన అగత్యం నుండి అది అతన్ని కాపాడుతుంది. ఏకేశ్వరోపాసనలో ఉన్న గౌరవోన్నతి మరెందులోనూ లేదు. అలాగే బహుదైవోపాసనలో ఉన్న పరాభవస్థితి మరెందులోనూ లేదు. ఇస్లాం దృష్టిలో మానవుడు సూర్యచంద్రుల కన్నా మిన్న. అతడు రాళ్లు రప్పలకన్నా, ఖనిజాలు లోహాల కన్నా, సముద్ర కెరటాలకన్నా, ప్రవహించే నదులకన్నా, నేలపై నిలబడి తమ వైభవాన్ని చాటుకుంటున్న పెద్ద పెద్ద పర్వతాలకన్నా శ్రేష్ఠుడు, ఆదరణీయుడు. అందుకే అతడు తన శిరస్సును ఒక్క సృష్టికర్త తప్ప మరెవరి ముందూ వంచకూడదు. ఇదే ఇస్లాం సందేశం! ఇదే మహాప్రవక్త (స) 23 సంవత్సరాలు కఠోరంగా పరిశ్రమించి మానవతకు ప్రసాదించిన సందేశ సారం!! ఈ విధంగా దైవం మరియు దైవప్రవక్త (స) మానవజాతిని అవమానం పాలు కాకుండా కాపాడారు.

మానవత్వం పట్ల మహనీయ ముహమ్మద్(స)కు గల మర్యాద అపారమైనది. బ్రతికి ఉన్న వారి విషయంలోనే గాకుండా, చని పోయినవారి విషయంలో కూడా ఆయన (స) ఈ మర్యాదను ఇనుమడించేలా చేశారు. మనిషికి ఏ విషయాల వల్ల అతని మనసు నొచ్చుకుంటుందో వాటి ఊసి అతడు చనిపోయిన తరువాత కూడా ఎత్తరాదని ఆదేశించారాయన. మర్యాద పూర్వకంగా మృతుని స్నానం చేయించాలనీ, ఉన్నంతలోనే పరిశుభ్రమైన వస్త్రాన్ని తొడిగించి, సుగంధద్రవ్యాలు పూసి సంస్కారవంతమైన రీతిలో అంత్యక్రియలు జరపాలనీ, శవ పేటికను ఎంతో వినయంగా ఎత్తుకోవాలనీ, శవాన్ని ఖననం చేసేదాక మనోవాక్కాయ కర్మల చేత ఎలాంటి అమర్యాదకు తావీయరాదని శాసించారు. పైగా మృతుని మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించాలనీ, మృతుని వారసులను ఓదార్చాలనీ, శోక సముద్రంలో మునిగి ఉన్న ఆ కుటుంబ సభ్యులకు ఆ రోజు భోజనాదులు సమకూర్చాలనీ బోధించారు. మృతుడు ముస్లిం అయినా, ముస్లిమేతర వ్యక్తి అయినా - అందరి పట్లా సంస్కారవంతంగా మసలుకోవాలని ఉద్బోధించారు.

ఒక సారి ఒక శవయాత్ర సాగిపోతుండటం చూసి ప్రవక్త మహనీయులు (స) మృతుని గౌరవార్థం లేచి నిలబడ్డారు. "దైవ ప్రవక్తా! ఇది ముస్లిం శవయాత్ర కాదు కదా! తమరెందుకు నిలబడ్డారు?" అని అక్కడున్న వారు సందేహపడగా "ఇతనూ ప్రాణియే కదా!" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

యుద్ధ సందర్భాల్లో ఆనాడు అరబ్బులు శత్రువులపట్ల మరీ కర్కశంగా ప్రవర్తించేవారు. శరీరావయవాలను ముక్కలు ముక్కలుగా నరికి వాటిని మాలగా చేసి మెడలో వేసుకుని వికటాట్టహాసం చేసేవారు. శత్రువును వధించి అతని పుర్రెలో మద్యం పోసి ఇస్తే అదొక గొప్ప అతిథి మర్యాద అనిపించుకునేది. స్వయాన ప్రవక్త (స) గారి పినతండ్రి ఆయిన హజ్రత్ హమ్జా (ర.అ) పట్ల సయితం ఉహద్ రణరంగంలో ఇలాంటి దుర్వ్యవహారం జరిగింది. ఇలాంటి అమానుష వైఖరిని అరబీ భాషలో "ముస్‌లా" గా వ్యవహరించేవారు. ఇలాంటి కిరాతకానికి ఎన్నడూ ఒడిగట్టరాదని మహనీయ ముహమ్మద్ (స) శాసించారు.

(ఇంకా వుంది)

PAGE 14-15.pdf 3/12/08 9:20:01 PM

పుణ్యార్జనలో

పేదలు కూడా ముందంజ వేయవచ్చు



ప్రశ్న : సార్! గోదావరి, కృష్ణ తదితర నదుల్లో నీట మునిగితే పాపం పోతుందని అంటారు. నేను ముస్లింనయ్యాను. ఇప్పుడు నేను ఇండియాకు వెళ్ళినపుడు ఆ నదుల్లో మునగవచ్చునా? మునగకూడదా?

- సుమయ్యా (సుగంధిని)
ఆర్డియా, కువైట్

జవాబు: ఏ నదిలో స్నానం చేసినా, ఏ నీట మునిగినా– ఆ నీరు పరిశుభ్రమై ఉంటే చాలు– మీరు పరిశుద్ధతను పొందుతారు. అయితే ఫలానా నదిలో స్నానం చేస్తే పాపాలు పోతాయన్న నమ్మకంతో స్నానం చేయటం మాత్రం ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే మీరు 'ముస్లిని' అని అంటున్నారు. ముస్లిం అనేవాడు మనోవాంఛలకు బానిసగా మారడు. పైగా అతను తాను నమ్మే దైవం మరియు దైవప్రవక్త (స) అభిమతానికనుగుణంగా నడుచుకుంటాడు. దైవ ధర్మమైన ఇస్లాం బోధనలన్నీ ప్రకృతికి, సహజత్వానికి అనుగుణంగా ఉంటాయి. ఏదైనా జలం పవిత్రమైనదని అనబడితే తప్ప మీ అంతట మీరుగా ఫలానా నదీ జలం పవిత్రమైనదని తలపోసి, దాన్ని ఒక మొక్కుబడిగా చేసుకుని ఆ పైన ఆ మొక్కుబడిని తీర్చుకోవటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. పైగా ఒక ముస్లిం కొరకు అది నిషిద్ధం (అధర్మం).

ప్రశ్న: ముస్లిం అయినవాడు అర్కానుల్ ఇస్లాంలోని పంచ సూత్రాలను పాటించటం వల్ల (సాక్ష్యవచనం పలికి, నమాజ్ చేసి, ఉపవాసాలు పాటించి, జకాత్ యిచ్చి, హజ్ చేయటం వల్ల) పుణ్యం పొంది స్వర్గానికి పోతాడని అంటున్నారు. కాని మా లాంటి పేద ముస్లింలు జకాత్ అనే దానం ఇవ్వలేరు. హజ్ కూడా చెయ్యలేరు. అలాంటప్పుడు మాకు పుణ్యం ఎలా దక్కుతుంది? మేము ధనవంతుల సరసన ఎలా నిలబడ గల్గుతాము? దయచేసి తెలియజేయండి.

జవాబు: జజాకల్లాహు ఖురా (ఈ ప్రశ్న వేసినందుకు దేవుడు మీకు ఉత్తమ ప్రతిఫలం ఇవ్వు గాక). ఇలాంటి సందేహం మీకే కాదు, మహాప్రవక్త ప్రియసహచరుల (రజి) కు సయితం కలిగేది. మహాప్రవక్త (స) ఆ ధర్మ సందేహాలను తీర్చేవారు.

ఒక విషయం బాగా గుర్తుంచుకోండి. అల్లాహ్ మనకు కలిమి నిచ్చినా, లేమికి గురిచేసినా– వాటి ద్వారా మనల్ని పరీక్షిస్తాడు. అందుకే కలిమిని పొందినవారు కృతజ్ఞతాభావంతో మెలగాలి. లేమికి (పేదరికానికి) గురైనవారు సహనభావాన్ని అలవరచుకోవాలి. ఈ ధోరణి ఉంటే రెండు అవస్థల్లోనూ అది 'ముస్లిం' పాలిట వరమవుతుంది.

సరే, ఇక అసలు విషయానికి వద్దాం. ఆర్థిక స్థోమత లేనివారు జకాత్ ఇవ్వవలసిన అవసరమూ లేదు, హజ్ యాత్రకు వెళ్ళవలసిన అవసరం కూడా లేదు. ఇక పుణ్యం అంటారా! పుణ్యాన్ని జుర్రుకునే అవకాశాలను పేదలకు పుష్కలంగా కల్పించాడు దేవుడు.

అన్నింటికన్నా ముఖ్య విషయం ఏమిటంటే పేదవారు ధనవంతులకన్నా ముందుగా స్వర్గంలో ప్రవేశిస్తారని సహీహ్ హదీసుల ద్వారా రూఢీ అవుతోంది. ఉదాహరణకు జిల్‌హజ్జ నెల మొదటి పది రోజులలో చేసే ఆరాధనలనే తీసుకోండి. ధనవంతులు కాబా గృహానికి వెళ్ళి హజ్ చేస్తే, పేదలు తామున్న చోటే ఉపవాసాల ద్వారా, నఫిల్ ఆరాధనల ద్వారా గొప్ప పుణ్యాన్ని పొందవచ్చు. అంతేకాదు, ఒక ముస్లిం అనుదినం 'తన సాధన ద్వారా' హజ్ ఉమ్రాలు చేసినంత పుణ్యాన్ని ఆర్జించవచ్చు. సునన్ తిర్మిజీలో హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఎవరయితే ఫజ్ర్ నమాజ్‌ను సామూహికంగా చేసి, దైవధ్యానంలో సూర్యోదయం వరకూ కూర్చొని ఉండి, ఆ తరువాత రెండు రకతుల నమాజ్ చేశాడో అతను ఒక హజ్ మరియు ఒక ఉమ్రా చేసిన పుణ్యాన్ని ఆర్జించాడు". మహిళా మణులు సయితం ఇంటి పట్టునే ఉండి అనుదినం అలవోకగా ఈ పుణ్యాన్ని మూటకట్టుకోవచ్చు.

ఇలాంటి ధ్యానాలు (అజ్‌కార్) ఇంకా ఎన్నో ఉన్నాయి. ధనవంతులు పుణ్యకార్యాల్లో ముందంజ వేస్తారన్నది నిజమే. కాని ఎప్పుడు? ఆ ధనాన్ని పుణ్యకార్యాలకై వెచ్చించినప్పుడే. అన్యథా ఆ ధనం వారికి గుదిబండగా మారుతుంది.

అదలా వుంచితే కలిమిలేములు శాశ్వతం కావు. అవి మారుతూ ఉంటాయి. మన దగ్గర కలిమి ఉన్నా, లేమి ఉన్నా– అది మన పాలిట వరమయ్యేలా మనం జాగ్రత్తపడాలి. అప్పుడే దేవుడు పెట్టిన పరీక్షలో మనం ఉత్తీర్ణులవుతాము.

ఖుర్‌ఆన్ కంఠస్థ పోటీల

విజేతలకు బహుమతులు



IPC ఆధ్వర్యంలో జనవరి 10,11 తేదీల్లో జరిగిన ఆరవ **దివ్య ఖురాన్ కంఠస్థ** పోటీలలో విజేతలైన వారికి బహుమతి ప్రదానోత్సవం ఫిబ్రవరి 20వ తేదీ బుధవారం సాయంత్రం **'హయ్యతుల్ ఖైరియా'** ఆడిటోరియంలో జరిగింది. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, న్యూ ముస్లిం సోదరులు బహుమతులను అందుకున్న వారిలో ఉన్నారు. 4,500 K.D ల ఈ ప్రాజెక్టుకు ఏటేటా **సులైమాన్ సాలెహ్ రుహైమానీ** కుటుంబీకులు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న సంగతి అందరికీ విదితమే.

విజేతలలో మన తెలుగు న్యూ ముస్లిం సోదరులైన **అబ్దుర్రహ్మాన్, ఉమర్** కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఇండియా, శ్రీలంక, చైనా దేశాలకు చెందిన కార్యకర్తలు సమర్పించిన **సాంస్కృతిక ఎగ్జిబిషన్** ప్రేక్షకులను ఆకట్టుకుంది.







PAGE 16-17.pdf 3/12/08 9:21:25 PM

IPC | వార్తలు

కువైట్‌లో అట్టహాసంగా జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాలు



59 వ భారత గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయ ప్రాంగణంలో రంగరంగ వైభవంగా జరిగాయి. IPC ధర్మప్రచార విభాగం కార్యకర్తలు కూడా ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. జనవరి 26వ తేదీ ఉదయం 9:00 గంటలకు భారత రాయబారి శ్రీ ఎమ్.గణపతిగారు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ జాతికి అందజేసిన సందేశాన్ని చదివి వినిపించారు.

కువైట్‌లోని వేలాది మంది ప్రవాస భారతీయులు, కువైటీలు సయితం ఎంతో ఆసక్తితో ఈ కార్యక్రమాలను తిలకించటం విశేషం. ఇండియన్ కమ్యూనిటీకి చెందిన వివిధ పాఠశాలల బాలబాలికలు ప్రదర్శించిన విద్యా, సాంస్కృతిక విన్యాసాలకు ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యారు. IPC ప్రీచర్లయిన షేఖ్ నజీబుద్దీన్ ఖాన్, దాయియా రాజియా– రిపబ్లిక్ దినోత్సవంలో పాల్గొని మాసపత్రికలైన **'నెలవంక'**, 'సందేశం', 'వసంతం', పుస్తకాలు, కేసెట్లు, కరపత్రాలు పంపిణీ చేశారు.



నిజం తెలుసుకో

-అబ్దుస్సత్తార్ 'మణి'

లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకరండి ఓ ప్రజలారా!
ఒక్కడైన ఆ సృష్టికర్తకే మొక్కండోయీ జనులారా!

గిరులు, ఝరులు, నింగి నేలకు సృష్టికర్తయే యజమాని
నిజానిజాలు తెలుసుకు మసలరా నిండు మనసుతో ఓ జీవా!
"లా ఇలాహ ఇల్లల్లాహ్"

చెట్టు, పుట్ట, రాయి, రప్ప దైవాలు కావురా ఓ నరుడా!
సర్వస్తోత్రములు అల్లాహ్‌కేనని తెలుసుకోరా ఓ పామరుడా!
"లా ఇలాహ ఇల్లల్లాహ్"


నీది నీది అనుకున్నది ఏది నీది కాదురా ఓ భాయి!
ఆస్తిపాస్తులు ఆలుపిల్లలు ఎవరు రారురా నీ వెంట
"లా ఇలాహ ఇల్లల్లాహ్"

అద్దమందు నీ ముద్దుమోము గని మురిసిపోకురా ఓ భాయి!
కాటి మట్టిలో కలిసే తనువిది మరచిపోకురా ఓ భాయి!
"లా ఇలాహ ఇల్లల్లాహ్"

ప్రళయ దినాన నిలబడినప్పుడు ఉండరెవరురా నీ తోడు
నీవు చేసిన కర్మపత్రమే మిగిలేదొకటే నీ జోడు
"లా ఇలాహ ఇల్లల్లాహ్"

(గేయ రచయిత కర్నూలు వాస్తవ్యులు. జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు. రచయితగా, వక్తగా తెలుగువారికి చిరపరిచితులు. 20 ఏళ్ల క్రితం ఆయన వ్రాసిన గేయమిది.)





మనసు

- సిఫాత్ ఆలం మదనీ

ప్రవక్త ప్రియసహచరులు కొండచరియ ప్రక్కన పొంచి ఉండి, అతని రాక కోసం ఎదురు చూడసాగారు.

పొద్దుగూకగానే సాలబా కొండ దిగివచ్చారు. దు:ఖ వదనులై ఉన్నారు. బక్క చిక్కిపోయారు. గొర్రెల కాపరులు పాలు పితికి ఇచ్చారు. పాల పాత్ర పెదాలను త్రాకుతుండగానే ఒక్కసారిగా దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఒక గుక్కెడు త్రాగారో లేదో పర్వత శిఖరం వైపు తిరోన్ముఖులయ్యారు.

అంతే. ఒక్కసారిగా హజ్రత్ ఉమర్(రజి) ఎదురయ్యారు. వెనకాలే సల్మాన్ ఫార్సీ (రజి) కూడా వచ్చారు. వాళ్లను చూడగానే సాలబా కలవరం చెందారు.

"ఇంతకీ మీరు నన్నెందుకు వెంటాడుతున్నారు?"

"దైవప్రవక్త(స) నిన్ను పిలుస్తున్నారు."

" ఆయన (స) ఏం కోరుతున్నారు."

"ఏమో! మాకు తెలీదు."

"ఏమిటి, అల్లాహ్ నా చర్యను ఖండిస్తూ ఏమైనా వాక్యాలు అవతరింపజేశాడా?"

"మాకు తెలియదు."

"అల్లాహ్ నన్ను గాని కపటుల వర్గంలో చేర్చలేదు కదా!"

"ఏమో మాకా సంగతి తెలీదు, అయితే దైవప్రవక్త(స) నిన్ను పిలుచుకు రమ్మన్నారు."

"నా జాతి ప్రజలారా! దయచేసి నన్ను విడిచి పెట్టండి. నన్నీ ఈ కొండల్లోనే చచ్చిపోనివ్వండి. మీరెళ్ళిపోండి" అని ప్రాధేయపడ్డారు.

ప్రవక్త ప్రియసహచరులు సాలబాను బలవంతంగా మదీనా తీసుకువచ్చారు.

....

"ఓ దైవప్రవక్తా! సాలబా బిన్ అబ్దుర్రహ్మాన్ దొరికాడు."

"ఎక్కడున్నాడు?"

"అతని పరిస్థితి ఏం బాగాలేదు. అతన్ని ఇంట్లోనే పడుకోబెట్టి వచ్చాము."

దైవప్రవక్త(స) సాలబా ఇంటికి విచ్చేసి, తలుపు తట్టారు. దైవప్రవక్త(స) గంభీర కంఠ స్వరం వినగానే సాలబా వణికిపోయారు.

"దైవప్రవక్తా! దేవుడు నా గురించి ఏదన్నా ఆయతు అవతరింపజేశాడా!?"

"లేదు" అంటూ దైవప్రవక్త(స) నెమ్మదిగా వచ్చి సాలబా ప్రక్కన కూర్చున్నారు. ఆప్యాయంగా సాలబా తల నిమిరి, తలను తన ఒడిలోకి తీసుకోబోయారు. సాలబా ఒక్క సారిగా బావురుమన్నారు.

"యా రసూలల్లాహ్! ఈ పాపిష్ఠివానికి దూరంగా జరగండి. మీ ఒడిలో సేద తీరే అర్హత నాకు లేదు" అన్నారు.

"సాలబా! ఇంతకీ నీకేం కావాలి?" అడిగారు దైవప్రవక్త(స).

"దైవ కారుణ్యం" అన్నారు సాలబా.

" దేని గురించి భయముంది?"

"దేవుని శిక్ష గురించి."

"దేవుడు నీవు కోరుకుంటున్న కారుణ్యాన్ని అనుగ్రహిస్తాడనీ, శిక్ష నుండి కాపాడుతాడని ఆశిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త(స).

మళ్ళీ ఏడ్చేశారు సాలబా, ఆ ఏడుపులో ఉద్వేగం, ఆనందం కలగలసి ఉన్నాయి. అంతే. సాలబాపై మృత్యుఛాయలు క్రమ్ముకున్నాయి. కలిమయె షహాదత్ చదవమని దైవప్రవక్త(స) చెప్పగా, పదేపదే కలిమా పఠించసాగారు సాలబా. క్షణాల్లోనే సాలబా ఆత్మ ఊర్ధ్వలోకాలకు సాగిపోయింది.

దైవప్రవక్త(స) స్వయంగా సాలబా భౌతిక కాయానికి స్నానం చేయించారు. కఫన్ వస్త్రం చుట్టి, జనాజా నమాజుకు సారథ్యం వహించారు. శవపేటిక ఖనన వాటికకు తీసుకుపోబడుతోంది. దైవప్రవక్త (స) చాలా ఇబ్బంది పడుతూ, కాలి వ్రేళ్లపై నడిచి వస్తున్నారు.

"దైవప్రవక్తా! దారి ఇస్తున్నాం కదా! ఎందుకలా ఇబ్బంది పడుతూ నడుస్తున్నారు?" అని హజ్రత్ ఉమర్ (రజి) ప్రశ్నించగా, "ఉమర్! దైవసాక్షి! దైవదూతలు సాలబా అంత్యక్రియలకు ఎలా ఎగబడుతున్నారంటే, కాలు తీసి కాలు వేయటానికి కూడా జాగా దొరకటం లేదు" అన్నారు దైవప్రవక్త(స).


అవును. మధన పడే మనసుతో తనువు చాలించారు సాలబా.

"తౌబతన్నసూహా" కు (సిసలైన పశ్చాత్తాపానికి) గొప్ప ఉదాహరణగా నిలిచారు సాలబా.

-రజి అల్లాహు అన్హు-

PAGE 18-19.pdf 3/12/08 9:22:29 PM

ఓ విశ్వాసులారా! నిష్కల్మషమైన పశ్చాత్తాప భావంతో అల్లాహ్ వైపు మరలండి. త్వరలోనే మీ ప్రభువు మీ పాపాన్ని మీ నుండి దూరం చేయవచ్చు. ఇంకా, పిల్ల కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో మీకు ప్రవేశం కల్పించవచ్చు." (అత్తహ్రీమ్ - 8)



మధన పడే

మనిషి బలహీనుడు. అతని వల్ల తప్పు జరగకుండా ఉండటమన్నది అసంభవం. ఎందుకంటే అనుక్షణం షైతాన్ అతన్ని వెంటాడుతూ ఉంటాడు. ముందు నుంచీ, వెనుక నుంచీ, కుడి వైపు నుంచీ, ఎడమ వైపు నుంచీ అతనిపై దాడి చేస్తుంటాడు. అందుకే మనిషి వల్ల తప్పులు జరుగుతుంటాయి. కాని చేసిన తప్పును తెలుసుకుని దైవసన్నిధిలో సిగ్గుతో కుంచించుకుపోయే భక్తులను దేవుడు ఎంతగానో ఇష్టపడతాడు.

రండి, పశ్చాత్తాపభావంతో కుమిలిపోయిన ఒక ధన్యజీవి వృత్తాంతాన్ని తెలుసుకుందాం. ఆయన ప్రవక్త ప్రియ సహచరుల్లో ఒకరు. పేరు సాలబా బిన్ అబ్దుర్రహ్మాన్ (రజి). అబూ నయీమ్, ఇబ్నె హజర్, ఇబ్నె హిబ్బాన్ వంటి ప్రఖ్యాత విద్వాంసులు తమ గ్రంథాలలో ఈ సహాబీ పశ్చాత్తాప వృత్తాంతాన్ని పొందుపరిచారు.

పదహారేండ్ల ఆ నవయువకుడు మహాప్రవక్త (స) సమావేశాలలో పాల్గొంటూ ఉండేవారు. అవసరం ఉన్నప్పుడు ప్రవక్త(స) ఆ యువకుణ్ణి పనిపై పంపిస్తూ ఉండేవారు. ఒకసారి దైవప్రవక్త (స) ఎవరినో పిలుచుకుని రమ్మని సాలబాను పంపారు. సాలబా అన్సార్లు నివసించే వీధి మీదుగా వెళుతున్నారు. ఒక ఇంటి వాకిలి దగ్గర నుంచి వెళుతున్నప్పుడు దృష్టి లోపలి వరండాపై పడింది. తలుపు తెరచుకుని ఉంది. వరండాలోకి వెళ్ళారు. సువాసన గుభాళిస్తూ ఉంది. స్నానశాలకు వ్రేలాడ దీయబడియున్న తెరను కొద్దిగా తొలగించి, తొంగిచూశారు. లోపల ఒక స్త్రీ స్నానం చేస్తూ ఉంది. ఆ స్థితిలో సాలబా ఆ మహిళను చూడగానే ఆయనలోని మనస్సాక్షి ఒక్క సారిగా మేల్కొంది. "సాలబా! దైవప్రవక్త(స) నిన్ను ఏ పని మీద పంపించారు? ఇక్కడ నువ్వేం చేస్తున్నావు?" అని హెచ్చరించింది. అంతే! సాలబా ఒల్లు జలదరించింది.

"నవూజుబిల్లాహ్! దైవప్రవక్త(స) నన్ను వేరే పని మీద పంపిస్తే నేనేమో యిక్కడ ఆడవాళ్ళుండే చోట తొంగి చూస్తున్నానా!? అయ్యో ! ఎంత ఘోరం జరిగిపోయింది? అల్లాహ్ నన్నెక్కడ కపటుల (మునాఫిఖ్) వర్గంలో చేరుస్తాడో! బహుశా నా చర్యను ఖండిస్తూ ఖుర్ఆన్‌లో ఆయతులు అవతరిస్తాయేమో!!"

ఈ విధంగా సిగ్గుతో కుంచించుకుపోయారు. ఒకవైపు తప్పు జరిగిపోయిందన్న బాధ... మరోవైపు ఈ పాపిష్టి ముఖాన్ని దైవప్రవక్త(స) కు ఎలా చూపించేది!? అనే గిల్టీ... ప్రవక్త సన్నిధికి వెళ్ళేందుకు ధైర్యం చాలట్లేదు. పోనీ, ఇంటికెళదామా! అంటే అందుకు కూడా మనసు ఒప్పుకోవటం లేదు...

పనిమీద వెళ్ళిన సాలబా తిరిగి రాకపోవటంతో ఆయన కోసం వెతకమని దైవప్రవక్త(స) సహచరులను ఆదేశించారు. సహచరులు మదీనాలోని ఒక్కొక్క వీధి, ఒక్కొక్క వాడా వెతికారు. కాని ఎక్కడా సాలబా జాడ లేదు.

రోజులు...వారాలు గడచిపోతున్నాయి. కాని సాలబా తిరిగి రాకపోయేసరికి దైవప్రవక్త(స) ఉమర్, సల్మాన్, తదితర సహాబీలను ప్రత్యేకంగా నియమించారు సాలబాను వెతకటానికి. ఎడారుల్లో, కొండల్లో గాలించమని పురమాయించారు.

గాలింపు మొదలయింది. మదీనా పోలిమేరలో ఎక్కడా కనిపించలేదు. చివరకు మక్కా-మదీనాల మధ్యలో ఒక పర్వతశ్రేణి దగ్గర ఆగారు. అక్కడ మనుషుల అడుగుజాడలు కనిపించాయి. అల్లంత దూరాన ఒక గొర్రెలకాపరి గొర్రెల్ని మేపుతున్నాడు. ఎంతకీ వీళ్లు అక్కణ్ణుంచి కదలకపోవటంతో "మీరిక్కడేం చేస్తున్నారు? ఎవరి కోసం వచ్చారు?" అని అడిగాడు. "మేమొక నవ యువకుణ్ణి వెతుకుతున్నాం" అన్నారు హజ్రత్ ఉమర్(రజి). "ఓహో ! పొద్దస్తమానం విలపిస్తూ ఉండే ఆ కుర్రాణ్ణి మీరు వెతుకుతున్నారా?" అన్నాడు పశువుల కాపరి. "అదిగో, ఆ పర్వతంపై ఎవరో ఒక అబ్బాయి నలభై రోజుల నుంచి ఉంటున్నాడు. అదే పనిగా ఏడుస్తూ, చేతులెత్తి క్షమాభిక్ష అర్థిస్తూ ఉంటాడు. అతని ఏడుపుతో ఒక్కోసారి పరిసరాలన్నీ ప్రతిధ్వనిస్తూ ఉంటాయి."

"అతను కొండ మీదే ఉంటాడా? అతన్ని చేరుకునే దారేది?"

"అతను సూర్యాస్తమయ సమయంలో క్రిందికి దిగివస్తాడు. మేమతనికి గొర్రెల పాలు పితికి ఇస్తాము. ఏడుస్తూనే రెండు గుక్కెళ్ళు త్రాగి తిరిగి వెళ్ళిపోతాడు."



మత్తు వదిలింది

– శాంతి ప్రియ

సాజిద్: అస్సలాము అలైకుమ్ రహ్మతుల్లాహి వబరకాతుహ్. మిమ్మల్ని కలుసుకుని చాలా సంతోషం కలిగింది.

ఆబిద్: వ అలైకుముస్సలామ్. నాకూ సంతోషమే.

సాజిద్: భవిష్యత్తులో మీ లక్ష్యం ఏమిటి?

ఆబిద్: మంచి పేరు తెచ్చుకోవాలి. మంచిని పెంచాలి. ఈ సమాజాన్ని ఉద్ధరించాలి. బాగా సంపాదించాలి.

సాజిద్: దానికి తగిన పథకం, ప్రణాళిక ఏదన్నా తయారు చేసుకున్నారా?

ఆబిద్: చేసుకున్నాను. కాని అమలుపర్చటంలోనే ఇబ్బందులొస్తున్నాయి.

సాజిద్: ఇబ్బందులంటే ఎలాంటివి?

ఆబిద్: ఏముంది? ప్రజలంతో సత్సంబంధాలు పెంచుకోవాలి. సమావేశాలలో పాల్గొనాలి. సమాజ శ్రేయం కోసం పాటుపడే సంస్థలతో కలసి పని చేయాలి. కానీ నాకు సమయం సరిపోవటం లేదు.

సాజిద్: అందరికీ దేవుడిచ్చింది 24 గంటలేగా. మరి ఎందరో వ్యక్తులు చేయగలుగుతున్న ఈ పనులు మీరెందుకు చేయలేకపోతున్నారు?

ఆబిద్: ఆ! ఏముంది!! దర్సె-ఖుర్‌ఆన్, దర్సె హదీసులు అన్ని సమాజు అనంతరం మొదలవుతాయి. ప్రజల విషయమంటారా... సాయంత్రం అయితేగాని వారు దొరకరు. మరి పొద్దున నుండి అలసిపోయిన నాకు విశ్రాంతి దొరికేది అప్పుడే.

సాజిద్: మీరు ఏ విధంగా రిలాక్స్ అవుతారు?

ఆబిద్: ఫ్రెండ్స్‌తో కాసేపు పిచ్చాపాటి మాట్లాడుతాను. టీవి చూస్తాను.

సాజిద్: అంతేనా...ఇంకేమైనా అలవాట్లున్నాయా?

ఆబిద్: పెద్దగా బాడ్ హాబిట్స్ ఏమీ లేవు. అప్పుడప్పుడు సిగరెట్ త్రాగుతాను. పండుగలకు ఫ్రెండ్స్ బలవంతం చేస్తే ఓ రెండు మూడు పెగ్గులు వేసుకుంటాను. ఈ మధ్య క్లబ్‌లో మెంబర్‌షిప్ తీసుకున్నాను. అలాగే ఆదివారాలు అలా విహార యాత్రలకు కూడా పోతుంటాను.

సాజిద్: సిగరెట్ త్రాగటం, (బలవంతం మీద) మందు తీసుకోవటం మానుకోవచ్చుగా!

ఆబిద్: ఫ్రెండ్స్, మెంబర్‌షిప్పు అన్న సాకేగానీ, మందు మంచి కిక్కు ఇస్తుంది. ఇక పేకాటలో వున్న మజాయే వేరు..!

సాజిద్: కిక్, మజా అంటే..?

ఆబిద్: మనస్సు నెమ్మదిస్తుంది.

సాజిద్: మీకేమైనా సమస్యలున్నాయా?

ఆబిద్: అబ్బే... అలాంటివేమీ లేవు. కాని అలా దమ్ము లాగటం వల్ల, మందు కొట్టడంవల్ల, జూదం ఆడటం వల్ల ఎంతో హాయిగా థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

సాజిద్: అంటే వాటివల్ల ప్రశాంతంగా ఉంటుందన్న మాట.

ఆబిద్: కరెక్ట్ ! బాగా చెప్పారు.

సాజిద్: ఒక వేళ సిగరెట్‌కి, మందుకి ప్రశాంతత ఇచ్చే శక్తి ఉంటే, డాక్టర్లు ఆడ, మగా, పిల్లలందరికీ అవే రికమెండ్ చేయొచ్చు కదా! పోనీ మనిషి బాగోగులు తెలిసిన ఆ దేవుడైనా ధర్మసమ్మతం చేసివుండవచ్చు కదా! లేదా మీరైనా మీ అత్తామామలకు, తల్లిదండ్రులకు, భార్యాపిల్లలకు ఆఫర్ చేయొచ్చుకదా!

ఆబిద్: అబ్బా ...! పెద్ద తలనొప్పే మీతో...!! మనిషి అన్నాక ఏదో ఒక వ్యసనం ఉండకుండా ఉంటుందా?

సాజిద్: ముందేమో హాబీ అన్నారు. ఇప్పుడు వ్యసనం అని (క్రిందికి దిగి) మాట్లాడుతున్నారేమిటి? అసలు ఇటువంటి వ్యర్థ వ్యసనాలను దేవుడు సంపూర్ణంగా నిషేధించాడు కదా!

ఆబిద్: కాని అవి కొన్ని సందర్భాల్లో లాభిస్తాయండీ! ఔషధంలా పని చేస్తాయి.

సాజిద్: దైవప్రవక్త(స) తో ఓ వ్యక్తి మీలానే ప్రశ్నించగా "అది ఔషధం కాదు, వ్యాధి" అన్నారు.

ఆబిద్: మీతో గొడవెందుకు గాని ఇవన్నీ తప్పకుండా ఒక రోజు మానుకుంటానులెండి.

సాజిద్: ఒక రోజు అంటే ఎప్పుడు?

ఆబిద్: నా లక్ష్యం నెరవేరిన తర్వాత.

సాజిద్: మీ లక్ష్యానికి ఈ వ్యసనాలు అడ్డుగోడలుగా ఉన్నాయి. కాబట్టి ఇప్పుడే మానేయొచ్చు కదా!

ఆబిద్: నిజమే కానీ, ఒక్కోసారి ఇవి నాకెంతో ఆనందాన్నిస్తాయి. ఇవి నాతో ఓ మంచి స్నేహితుడిలా ఉంటాయి.

సాజిద్: అంటే జూదం, మద్యం, వ్యభిచారం లాంటి వ్యర్థ వ్యసనాలు మీ మిత్రులంటారు. మరి వీటి వల్ల లక్ష్యం చెదురుతుందికదా! భార్యాపిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది కదా! సమాజంలో మీకు గౌరవం లేకుండా పోతుంది కదా!

ఆబిద్: మీరు చెప్పినట్టే నేను నా భార్యా పిల్లలను సంతోషంగా ఉంచుతూ, ఇవన్నీ డీల్ చేస్తున్నాను. వీటివల్ల నేను మునుపటికన్నా ఎక్కువ ఉత్సాహంగా ఉంటున్నాను. నా భార్యాపిల్లల పట్ల ప్రేమ కూడా ఎక్కువయ్యింది. ఎవరికీ ఏ హానీ జరగటం లేదు. అలాంటప్పుడు నా ఈ థియరీ కరెక్టు కాదంటారా!?

సాజిద్: కరెక్టే... కానీ... మీ భార్యాపిల్లలు కూడా ఇదే థియరీని చెప్పినపుడు మీరిలాగే మనస్ఫూర్తిగా ఒప్పుకుంటారా!

ఆబిద్: నా థియరీ తప్పేననుకోండి....

సాజిద్: అదీ, అలా రండి దారికి. వ్యసనాలు ముఖ్యమా?లక్ష్యంముఖ్యమా?

ఆబిద్: లక్ష్యమే అనుకోండి.

సాజిద్: మరి వ్యాధికన్నా భయంకరమైన ఈ వ్యసనాలకు ఈ క్షణమే గుడ్‌బై చెప్పండి.

ఆబిద్: నా కళ్ళు తెరిపించారు. కుళ్ళు బ్రతుకేదో, కరక్టు బ్రతుకేదో బోధపర్చారు. మెనీ మెనీ థ్యాంక్స్! ఇప్పుడు ఈక్షణమే వీటన్నిటిని విడిచి పెడుతున్నాను. అల్లాహ్ ముందు లెంపలేసుకుంటున్నాను.

సాజిద్: అల్‌హందు లిల్లాహ్! అల్లాహ్ నా ద్వారా ఒక జీవి నిజం గ్రహించేటట్లు చేశాడు. పదండి. మీ కొత్త జీవితాన్ని మగ్రిబ్ నమాజుతో ప్రారంభిద్దురు గాని...

.....తథాస్తు .....

PAGE 2-3.pdf 3/13/08 5:36:43 PM



بسم الله الرحمن الرحيم



రిటర్న్ టికెట్!

జీవనోపాధి కోసం కువైట్‌లో కాలు మోపిన నా దేశ సోదర సోదరీమణులారా!

మీరు మీ పుట్టిన ఊరును, స్వదేశాన్ని మరువగలరా!? మీలో ప్రతి ఒక్కరూ కోరుకునేది ఒక్కటే-వీలైనంత తొందరగా అప్పులు తీర్చుకోవాలి. పిల్లల్ని చదివించుకోవాలి. చెల్లాయి పెళ్ళి చేయాలి. ఇల్లు చక్కదిద్దుకోవాలి. నాలుగు డబ్బులు సంపాదించుకుని సగౌరవంగా స్వస్థలానికి తిరిగి వెళ్ళాలి.

ఈ ప్రోగ్రాం పెట్టుకుని ఇక్కడకు వచ్చిన వారు ఏ పనీ పాటా లేకుండా గాలికి తిరిగారనుకోండి, ఒకవేళ పనిచేసి సంపాదించినా ఆ సంపాదనను వ్యసనాల కోసం తగలబెట్టారనుకోండి, అలాంటి వారి గురించి మీ అభిప్రాయం ఏమిటి?

ఈ ప్రాపంచిక జీవితం కూడా అటువంటిదే. ఈ లోకంలోకి ఏతెంచిన ప్రతి వ్యక్తీ 'రిటర్న్ టికెట్'ని తన వెంటే తెచ్చుకుంటాడు. పరలోక యాత్రకు సంబంధించిన టిక్కెట్టది. అంటే ఎక్కణ్ణుంచి వచ్చాడో అక్కడికే పోవాలి. టిక్కెట్ మాత్రం ఇంకా కన్‌ఫర్మ్ కాలేదు- వెయిటింగ్ లిస్టులో ఉంది. ఏ క్షణంలోనయినా అది కన్‌ఫర్మ్ కావచ్చు. కన్‌ఫర్మ్ కాగానే 'అఖామ' కట్ అయిపోతుంది.

మృత్యువు కూడా మహా విచిత్రమైనది. దానికి ముహూర్తం లేదు. దానికొక వేళాపాళా లేదు. మృత్యువు శకునాలు చూడదు. దానికి దయాదాక్షిణ్యాలు అసలే లేవు. మంచివారు -చెడ్డవారన్న విచక్షణ లేదు. ఆరోగ్యవంతులు-రోగగ్రస్తులన్న తేడాపాడాలు కూడా లేవు. అది ఎప్పుడయినా రావచ్చు. ఎంతటి వారినయినా ఇట్టే కబళించవచ్చు. ఎవరూ చేయగలిగిందేమీ లేదు. ఆత్మ ఆకాశాల్లోకి సాగిపోతూవున్నప్పుడు కళ్లు దాన్ని వెంబడిస్తాయి. ఆశతో ఆత్మ వంక చూస్తాయి. కాని...

నిన్నటి వరకూ బెల్లం చుట్టూ ఈగల్లా ముసురుకున్న ఆత్మీయులే ఇప్పుడు ఆత్మ లేని శరీరాన్ని వదిలించుకోవటానికి, వీలైనంత తొందరగా వల్లకాటికి సాగనంపటానికి ఆదుర్దా చెందుతారు. ఇంతే ఈ జీవితం. ఇంతే ఈ భవబంధాలు.

మన జీవితం క్షణం క్షణం మంచుగడ్డలా కరిగిపోతోంది. మన కిష్టమున్నా లేకున్నా గమ్యస్థానం (Destination) వైపు సాగిపోతున్నాం. కువైట్ నుంచి బాగా సంపాదించుకు వెళ్ళిన వారికి ఇండియాలో ఘనంగా స్వాగతం లభిస్తుంది. పరలోకంలోనూ అంతే. ఎవరు ఈ ప్రాపంచిక జీవితమనే పరీక్షలో ఉత్తీర్ణులై, సత్కర్మలతో ఊర్ధ్వలోకాలకు సాగిపోతారో వారికి లభించే స్వాగతం ఇలా ఉంటుంది-

"నెమ్మదించిన ఓ మనసా! పద, నీ ప్రభువు వైపు. నువ్వు నీ ప్రభువు పట్ల సంతోషపడ్డావు. నీ ప్రభువు నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. సజ్జనులైన నా భక్తుల్లో చేరిపో. భోగభాగ్యాలతో కూడుకున్న నా స్వర్గంలో చేరిపో." (90: 27-30)

తప్పుడు ప్రయోగమని, మతధర్మాన్ని నిజాయితీగా అనుసరించే ప్రతివ్యక్తీ ఫండమెంటలిస్టేనని **శ్రీ ఎం.గణపతి** హర్షధ్వానాల మధ్య వక్కాణించారు.

కువైట్‌లోని సుప్రసిద్ధ షరీయతువేత్త అయిన **డా.ముహమ్మద్ తబ్తబాయి** ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ప్రజా బాహుళ్యంలో సత్యాన్ని, సహనాన్ని పెంపొందించే ప్రయత్నంలో



భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.

కువైట్ చరిత్రలో జరిగిన అతిపెద్ద ధార్మిక సమ్మేళనంగా భావించబడే ఈ సదస్సులో సుమారు 18 వేల మంది ముస్లింలు, ముస్లిమేతరులు పాల్గొన్నారు. **డా.జాకిర్ నాయక్** గంటన్నరసేపు ఆంగ్లంలో ప్రసంగించిన తరువాత ముస్లిమేతర సోదరసోదరీమణులు వేసిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ఈ సభలో అతిథులుగా విచ్చేసిన వారిలో పీస్ టీవి గల్ఫ్ మేనేజర్ **షేఖ్ జమాన్ జహ్రానీ, షేఖ్ వలీద్ అల్ ఘానిమ్,** IPC దావా విభాగం మేనేజర్ **షేఖ్ ఖాలిద్ అస్సబా,** IMA అధ్యక్షులు **ముహమ్మద్ అస్లం,** KIG అధ్యక్షులు **ఫైసల్ మంజేరీ** తదితరులు ఉన్నారు. IMA మెంబర్ బ్రదర్ **ముహమ్మద్ షర్ఫుద్దీన్** వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమాలన్నింటికీ **మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ** సమన్వయ కర్తగా వ్యవహరించారు.



"ISLAM- The solution not the problem for humankind"

అనే అంశంపై 01-03-2008 వ తేదీ శనివారం సాయంత్రం స్థానిక గర్నాతా స్టేడియంలో జరిగిన సమావేశంలో ఒక దృశ్యం. ఈ సమావేశంలో కువైట్‌లోని ముస్లిమేతర మేధావులు, విద్యావంతులు హెచ్చు సంఖ్యలో పాల్గొన్నారు. డా.జాకిర్ నాయక్ గంటన్నర సేపు ఆంగ్లంలో అనర్గళంగా ప్రసంగించారు. మరో గంటన్నర సేపు ప్రేక్షకుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.



PAGE 4-5.pdf 3/12/08 9:45:46 PM

గ్రేట్ మెగా ఈవెంట్ ఇన్ కువైట్

పోటెత్తిన జన సముద్రం

పెక్కు మత ధర్మాలలో ఉన్న నిజమైన దైవ భావనను ఆ మతాల వారు సరిగ్గా అవగాహన చేసుకుంటే ఏ సమస్యా ఉండబోదని విశ్వ విఖ్యాత ఇస్లామీయ వక్త **డా.జాకిర్ నాయక్** వక్కాణించారు.

దైవగ్రంథాలు కలిగి ఉన్న మతావలంబీకులు చిన్న చిన్న విభేదాలను ఉపేక్షించి తామందరి మధ్యా సమానంగా ఉన్న **"ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం"** పై ఏకమవ్వాలని ఆయన పిలుపు ఇచ్చారు.



29-02-2008 వ తేదీ శుక్రవారం సాయంత్రం కువైట్‌లోని టూరిస్టిక్ పార్కులో ఇస్లాం ప్రజెంటేషన్ కమిటీ **(IPC)** ఆధ్వర్యంలో ఇండియన్ ముస్లిం అసోసియేషన్ **(IMA)**, కేరళ ఇస్లామిక్ గ్రూప్ **(KIG)** వారు కలసి ఏర్పాటు చేసిన గొప్ప ధార్మిక సదస్సులో **"Concept of God in Major Religions"** అన్న అంశంపై **డా.జాకిర్ నాయక్** ఉపన్యసించారు.



కువైట్‌లోని భారత **రాయబారి శ్రీ ఎమ్. గణపతి** ఈ సదస్సులో ప్రారంభోపన్యాసమిస్తూ ఇలాంటి సదస్సులు మతవర్గాల మధ్య సదవగాహనకు దోహదపడతాయని చెప్పారు. మత ఛాందసవాదం **(Religious Fundamentalism)** అనే పద ప్రయోగం







"కొత్త సంవత్సర గడియల్లో .. ముంబాయి గేట్ వే ఆఫ్ ఇండియా ముందు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ఇద్దరు అమ్మాయిలు బాయ్ ఫ్రెండ్స్‌తో కలిసి సంబరాల్లో పాల్గొంటున్నారు. చుట్టూ చేరిన వందమంది మగాళ్లు హఠాత్తుగా తోడేళ్ల గుంపుగా మారారు. వారికి చావొక్కటే తక్కువ అనిపించే నరకాన్ని చవి చూపించారు. ఆధునిక భారతావనికి చుక్కానిగా పేరొందిన ముంబాయి నగరం టీవీల్లో ఆ దృశ్యాలు చూసి సిగ్గుగా తలవంచుకుంది.

బయటికి రాని సంఘటనలు ఎన్నో! ముంబాయి పోలీస్ కమీషనర్ వీటిని నిలువరించడం తమ వల్ల కాదని చేతులెత్తేశారు **(ఈనాడు 13/1/2008).** ఈ వార్త, ఇలాంటి సంఘటనలు మన సామాజిక అంశాల విశ్లేషణ చేసేవారిని ఆవేదనకు గురిచేయలేకపోయాయి.

అశ్లీల సంఘటనలు జరిగినప్పుడు అంతా అబ్బాయిలదే దోషం అంటూ నిందిస్తారు. రెండో వైపు కూడా చూడాలి. ఇలా జరగడానికి అమ్మాయిలు కూడా కొంత కారణం అని మరచిపోకూడదు.

అమ్మాయి హద్దుల్లో ఉంటేనే అందం. గౌరవం. హద్దులకు పునాది నైతిక విలువలు. వాటిని లక్ష్యపెట్టకపోతే ఏమవుతుంది!? మహిళా కళాశాలల్లో చదువుతున్న అమ్మాయిలు ప్రధాన స్రవంతి **(Main Stream)** లోకి వచ్చేసరికి కొద్ది కాలంలోనే అన్నీ అనుభవించాలన్న తపనను ప్రదర్శిస్తారు. చుడిదార్ల నుంచి జీన్స్‌లోకి వస్తారు. అంతటితో ఆగకుండా కురచ దుస్తులు ధరిస్తారు. వారాంతపు కాలక్షేపం పేరిట అబ్బాయిలతో విచ్చలవిడిగా కలసి పార్టీలు, పబ్‌లు-ఇంకొందరు మరో అడుగు ముందుకేసి వారాంతపు విహార యాత్రలకు వెళ్లి కోరి కష్టాల్లోకి దిగుతారు. అమ్మాయిల జీవనశైలిలో చాలా మార్పు వచ్చింది. రాత్రివేళల్లో ఉద్యోగాలు, వేళ కానివేళ బైకులపై షికార్లే వీటికి నిదర్శనం..కుటుంబాల్ని విడిచి ఉండటం వల్ల వారికి అపరిమితమైన స్వేచ్ఛ లభించింది. సొంత సంపాదన ధైర్యాన్నిచ్చింది. ఫలితంగా మితిమీరిన అలంకరణలు చేసుకుంటారు. సాధారణ సంభాషణల్లో కూడా ఉద్వేగ భరితమైన మాటలు జొప్పిస్తారు. వారి వేషధారణ, కదలికలు యువకులను రెచ్చగొడతాయి. ఇలాంటి సమయాల్లో కొంతమంది ఉద్వేగంతో మితిమీరి ప్రవర్తిస్తారు.



24 గంటలు టీవీల్లో ఫ్యాషన్ షోలు, పబ్బుల్లో, క్లబ్బుల్లో యువతీయువకులు వేసే చిందులే చూపిస్తున్నారు. వీటికి తోడు సినిమాలు, సీరియల్ కతలు, అశ్లీల సాహిత్యం అమ్మాయిల పట్ల అమానుషంగా ప్రవర్తించటం నేర్పుతున్నాయి. పసిపిల్లల జీవితాలను బలి తీసుకుంటున్నాయి. నైతిక విలువలను అపహాస్యం చేస్తున్నాయి. వైవాహిక జీవితాలను నాశనం చేస్తున్నాయి. సమాజంలో హింసను ప్రేరేపిస్తున్నాయి.

"అమెరికాలో ప్రతి 46 సెకెన్లకు ఒక మహిళ బలాత్కారానికి గురి అవుతుందని 86 శాతం బలాత్కారం చేసే వాళ్లు తరచూ అశ్లీల సాహిత్యాన్ని చదువుతామనీ, టీవీలలో తాము చూసిన అశ్లీల దృశ్యాల్లో లాగ ప్రవర్తిస్తామనీ ఒప్పుకున్నారు" అని కె. డా. విలియమ్ మార్షల్ అంటారు.



పరిష్కార మార్గాలు

1.ధార్మిక పండితులు, సంఘ సంస్కర్తలు నడుం బిగించి యువకుల స్వేచ్ఛా కలయికను ఖండించాలి. బూతు సినిమాలను, అశ్లీల సాహిత్యాన్ని యువతీయువకుల భావోద్రేకాలను రెచ్చగొట్టే ఫ్యాషన్ షోలను నిషేధించటానికి ఉద్యమించాలి.

2.పెండ్లీడుకు వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిల పెండ్లిళ్లకు కుటుంబ పెద్దలు, సంరక్షకులు త్వరపడాలి. కట్నం కానుకలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

3.స్త్రీ పురుషులు తమ నైజం, శరీర నిర్మాణం రీత్యా ఎంతో భిన్నంగా ఉండడం వల్ల వీరుభయుల కార్యాచరణ పరిధులు కూడా వేరుగా ఉంటాయని గుర్తించాలి. మహిళామణి శ్రద్ధాసక్తులు అనవసరమైన ఇతరత్రా కార్యకలాపాల వైపుకు మళ్ళితే, ఆమె ఇల్లు వదిలి బయట స్వేచ్ఛగా తిరిగితే ఆమె "ఉత్తమ తల్లి" "ఉత్తమ ఇల్లాలు" "ఆదర్శమహిళ" అవడానికి బదులు కామాంధుల చేతుల్లో చిక్కుకొనే ప్రమాదం పొంచి వుందని తెలియజెప్పాలి.

4. లైంగిక తృప్తికై ధర్మ సమ్మతమైన మార్గం వివాహం. ధర్మాన్ని కాలరాచి అధర్మాన్ని అనుసరిస్తూ అమ్మాయిలపై అత్యాచారానికి ఒడిగట్టిన వారిని, వివాహితులై కూడా అక్రమ సంబంధాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి. కామాంధులు, ప్రేమోన్మాదులు మానవ శరీరంలో విషపూరితమైన అవయవం లాంటివారు. మనిషి ప్రాణాపాయం నుండి బయటపడాలంటే విషపూరితమైన అవయవానికి శస్త్ర చికిత్స చేసి, తొలగించక తప్పదు. అలాగే వ్యాధిగ్రస్తమైన సమాజానికి ఆరోగ్యం లభించాలంటే నేరస్తులను ఏరివేయాలి. అప్పుడే మన సమాజం బాగుపడుతుంది. మహిళలకు రక్షణ లభిస్తుంది. జాతి ఆడపడుచుల మానమర్యాదలు సురక్షితంగా ఉంటాయి. ఇవి కారుణ్య ప్రభువైన అల్లాహ్ సూచించిన పరిష్కార సూత్రాలు. ■

PAGE 6-7.pdf 3/12/08 8:53:33 PM

మారాలి ప్రవర్తన - రావాలి పరివర్తన





– అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

"విద్యార్థినిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి."
"విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అత్యాచార యత్నం".
"ప్రేమికుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యా యత్నం".
"గృహిణి సామూహిక అత్యాచారానికి బలి".

ఏ దిన పత్రిక తెరిచినా, ఏ దూరదర్శన్ వార్తలు విన్నా మనకు కనిపించే శీర్షికలు, వినిపించే ముఖ్య విశేషాలు ఇవే. ఇలాంటి వార్తలు చదివి, విని తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దేవుడా! మా చిట్టి తల్లిని కామాంధుల, ప్రేమోన్మాదుల బారి నుండి కాపాడు" అని మొర పెట్టుకుంటున్నారు. ఇది ఒక కోణం.

మరో కోణం నుంచి చూడండి– టీనేజ్ ప్రేమలు, ప్రేమ పెళ్ళిళ్లు, కులాంతర వివాహాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. "మేము ప్రేమించుకున్నాం. పెళ్లి చేసుకున్నాం. మా ఇంట్లో మా పెద్దలు ఈ పెళ్లికి ఒప్పుకోలేదు. మాకు ప్రాణాపాయం పొంచి ఉంది. మాకు రక్షణ కల్పించాలి" అంటూ ప్రేమ జంటలు చట్టాన్ని ఆశ్రయిస్తున్నాయి.

ఈ సంఘటనలు కుటుంబ పెద్దల్ని ఆవేదనకు గురి చేస్తున్నాయి. తల్లి దండ్రుల్ని కలవరపెడుతున్నాయి.

జాతీయ నేర గణాంకాల సంస్థ (**NCRB**) విడుదల చేసిన నివేదిక ప్రకారం మన దేశంలో ప్రతి గంటకు రెండు అత్యాచారాలు, రెండు అపహరణాలు, నాలుగు లైంగిక వేధింపులు, ఏడు గృహ హింస, వరకట్న మరణ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

మహిళలపై ఆకృత్యాలు పెరిగిపోతున్నాయి అని బాధపడేవారు లేకపోలేదు. కాని మహిళలే బాధితులవడానికి కారణాలు ఏమిటి? అని విశ్లేషించేవారు చాలా అరుదు.

"చదువు ..కొలువు.. అందం.. ఐశ్వర్యం.. ఇలా అన్నింటా స్వతంత్రత కోసం తపిస్తున్నారు నేటి అమ్మాయిలు. ఆర్థిక స్వేచ్ఛ వారికి ఆత్మీయ నేస్తం అవుతోంది. ఫ్యాషన్ షోలో పురుష మోడళ్ళ శరీరం తీరు చూసి కేరింతలతో కవ్వించడం..లేదా గోల చేసి ఈల వేయడానికి వారు సంకోచించటం లేదు. అంటూ సామాజిక అంశాల విశ్లేషకురాలు డాక్టర్ పద్మా వేణుగోపాల్ అమ్మాయిలను ఆకాశానికి ఎత్తేసారు **(ఈనాడు 30/12/2007)**. కాని



- అబూ తఫ్‌హీమ్
ipctelugu@rediffmail.com

విశ్వాసుల మాత

హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా)

హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా) గారి అసలు పేరు జైనబ్. ఖైబర్ యుద్ధానంతరం విజయప్రాప్తిగా **దైవ ప్రవక్త(స)** భాగంలోకి వచ్చారు. అరేబియాలో నాయకుడు లేదా చక్రవర్తి కోసం ప్రత్యేకించబడిన విజయ ప్రాప్తిని **'సఫియ్యా'** గా వ్యవహరిస్తారు కాబట్టి, ఆమె **సఫియ్యా**గా పిలువబడ్డారు.

హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా) గారి కుటుంబం, హజ్రత్ హారూన్ బిన్ ఇమ్రాన్ వంశానికి చెందినది. తండ్రి బనూ నజీర్ నాయకుడైన హుయి బిన్ అఖ్‌తబ్- తల్లి పేరు జర్ద్- ఆమె కూడా బనూ ఖురైజా నాయకుని పుత్రికే. ఈ రెండు కుటుంబాలు (ఖురైజా, నజీర్) ఉత్తర అరేబియాలో స్థిరపడిన ప్రసిద్ధ తెగలలో ఎన్న దగినవారు.

హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా) భర్త కనాన, తండ్రి- ఇద్దరూ ఖైబర్ యుద్ధంలో మరణించాక, నాయక వంశానికి చెందిన సఫియ్యాను **ప్రవక్త (స)** గారే వివాహమాడాలని సహాబా కోరగా, ప్రవక్త మహనీయులు ఈ ప్రతిపాదనను అంగీకరించారు. **సఫియ్యా**కు స్వేచ్ఛను ప్రసాదించారు. నికాహ్ హిజ్రీ 7వ ఏట జరిగింది. నికాహ్ తరువాత ఖైబర్ నుండి బయలుదేరారు. 'సహ్‌బా' అనే ప్రాంతంలో నికాహ్ వేడుకలు జరుపుకున్నారు. వలీమా కూడా మరుసటి రోజు అక్కడే జరిగింది. అక్కణ్ణుంచి మదీనాకు బయలుదేరేటప్పుడు **ప్రవక్త(స)** ఆమెను తమ ఒంటెపై కూర్చోబెట్టుకున్నారు. ఆమెపై పరదా వేసారు. అంటే ఆమె **ప్రవక్త(స)** దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టి, **ప్రవక్త** నతీమణుల్లో ఒకరయ్యారన్నదానికి అది సంకేతం అన్నమాట!

మదీనా చేరగానే **ప్రవక్త(స)** హజ్రత్ హారిస్ బిన్ నూమాన్(ర.అ) ఇంట్లో బస చేసారు. హజ్రత్ హారిస్, **ప్రవక్త** గారి సహాబాల్లో ప్రాణమిత్రుడు. స్థితిమంతులు కూడా. **ప్రవక్త (స)** గారిని అన్ని విధాలా ఆదుకునేవారు. హజ్రత్ జైనబ్, హజ్రత్ హఫ్సా, హజ్రత్ ఆయిషా, మరియు జువైరియా (ర. అన్‌హున్న) లు అన్సారీ స్త్రీలతో కలిసి **సఫియ్యా (ర.అన్‌హా)** ను చూడటానికి వచ్చారు. **సఫియ్యా** అందచందాలను గూర్చి విని అన్సారీ స్త్రీలెందరో ఆసక్తిగా వచ్చి చూడసాగారు. తిరిగి వెళుతుండగా **ప్రవక్త (స)** గారు ఆయిషా(ర) ను పిలిచి "సఫియ్యా ఎలా వుంది"? అని అడగ్గా "ఎంతైనా యూదురాలే కదా!" అని బదులిచ్చారు. "అలా అనకు, ఇప్పుడామె ముస్లింగా ధర్మ పరివర్తన చెందింది. ఆమె పరివర్తన బహు చక్కని పరివర్తన" అని చెప్పారాయన(స).

హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా) వద్ద ఒక బానిసరాలు వుండేది. ఆమె తరచూ హజ్రత్ ఉమర్(ర) గారికి సఫియ్యా గురించి ఫిర్యాదు చేసేది. ఒక రోజైతే "ఆమెలో ఇంకా యూదత్వం పోలేదు" అని అనేసింది. ఆమె శనివారం రోజును పవిత్రంగా భావిస్తుందనీ, యూదుల పట్ల చాలా ఆప్యాయంగా వ్యవహరిస్తుందని ఆరోపించింది. హజ్రత్ ఉమర్(ర) విషయమేంటో కనుక్కునిరమ్మని ఒక వ్యక్తిని పంపగా "శనివారానికన్నా గొప్ప రోజు శుక్రవారం నాకు అల్లాహ్ ప్రసాదించాడు. ఇక యూదుల పట్ల సత్ప్రవర్తన అంటారా, వారితో నా బంధుత్వం ఉంది" అని **హజ్రత్ సఫియ్యా (ర)** జవాబిచ్చారు.

ఆ తరువాత సఫియ్యా (ర) "నువ్వు అలా తప్పుగా ఎందుకు చెప్పావని", బానిసరాలిని అడగ్గా, "అవును తప్పే, షైతాన్ నాకు తప్పు దారి పట్టించాడు" అని సేవకురాలు చెప్పింది. **హజ్రత్ సఫియ్యా (ర.అన్‌హా)** ఆమెని క్షమించి, బానిసత్వం నుండి విడుదల కూడా చేసేశారు.

(ఇంకా వుంది)



PAGE 8-9.pdf 3/12/08 8:56:02 PM

పవిత్ర జీవితం

దారున్నదా (ఖురైషీ పార్లమెంటు)





సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

ప్రవక్త (స) గారి చాలా మంది సహచరులు మదీనాకు వలసపోయారు. మదీనాలో "ఔస్", "ఖజ్రజ్" ప్రముఖ తెగలు. వారే తరువాత "అన్సార్" గా పిలువబడ్డారు. కారణం: వారు విశ్వాసులకు, హిజ్రత్ (వలస) చేసి వచ్చిన ముస్లిములకు ఆశ్రయం ఇచ్చి ఆదుకున్నారు. మదీనాకు వెళ్ళి ముస్లింలు శక్తిని పుంజుకోవడం, వారి ద్వారా ఇస్లామ్ పరివ్యాప్తి చెందటం చూసి మక్కా విగ్రహారాధకుల శిబిరాల్లో కలవరం పుట్టింది. వారు ఎంతో వ్యాకులపడ్డారు. ఎందుకంటే– వారి చిల్లరదేవుళ్ళ రాజ్యం సమీపంలోనే నేలమట్టం కానున్నది. దైవ ప్రవక్త(స) గారి వ్యక్తిత్వం గురించి వారికి బాగా తెలుసు. ఆయన సత్యసంధత, నాయకత్వ లక్షణాల గురించి, ఆయన సహచరుల ధైర్యసాహసాల గురించి, విశ్వాసంపై వారిలోగల నిలకడ, స్థిరత్వం, ఆత్మ స్థయిర్యం వారికి అనుభవైక విషయమే. అలాగే "ఔస్, ఖజ్రజ్" తెగలు కూడా వారి పక్షాన్నే ఉన్నారు. కనుక ఖురైష్ నాయకులంతా కలిసి మక్కాలో ఓ పార్లమెంటు ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల ఉన్న తెగలన్నీ సమావేశమై ప్రతి తెగలో నుంచి ఒక్కొక్క యువకుణ్ణి ఎన్నుకొని, వారంతా కలిసి ముహమ్మద్(స) పై ఒక్కసారిగా దాడి చేసి, ఆయన్ను హతమార్చాలి. ఈ హత్యానేరం అన్ని తెగలపై పడుతుంది. అప్పుడు హాషిమ్ వంశీయులు తెగలన్నిటినీ ఎదిరించి పోరాడటం సాధ్యపడదు అని వారు తీర్మానించారు.

మహాప్రవక్త(స) గారి హిజ్రత్

"దైవప్రవక్త(స) ను కడతేర్చాలన్న (దైవం మన్నించుగాక!) ఒప్పందం జరిగిన తరువాత దైవదూత జిబ్రయీల్ (అలై) ప్రవక్త(స) దగ్గరకు వచ్చి ఖురైష్ తీర్మానం గురించి తెలియపర్చడంతో పాటు, వలస పోవడానికి అల్లాహ్ అనుమతించాడని తెలిపారు. బయలుదేరవలసిన సమయం కూడా నిర్ధారించారు జిబ్రయీల్ (అలై). అలాగే ఈ రాత్రి మీరు మీ పడకపై గడపకండని కూడా సలహా ఇచ్చారు. ప్రయాణ సన్నాహాల నిమిత్తం చర్చించడానికి ప్రవక్త(స) హజ్రత్ అబూ బక్ర్ (రజి) గారిని సంప్రదించారు. మరో వైపు ఖురైషులు తమ పథకం అమలుపర్చే గడియ ఎప్పుడు వస్తుందా అని కాచుకుని ఉన్నారు.

రాత్రివేళ తెగ నాయకుల్లో 12 మంది ప్రముఖులు బైతుల్లాహ్ ముందు ప్రవక్త(స) గారు ఎప్పుడు నిద్రపోతారా, ఎప్పుడు ఆయన్ను తుదముట్టించాలా అని మాటువేసి కూర్చున్నారు. వారి ఒప్పందం ప్రకారం అర్ధరాత్రి తరువాత పథకాన్ని అమలు పర్చాలి. వారంతా ఆ ఘడియ కోసం జాగారం చేస్తున్నారు. కాని భూమ్యాకాశాలను తన గుప్పిట్లో బంధించి వున్న ఆ పరమ ప్రభువు తను తలచింది చేసి చూపించాడు. అర్ధ రాత్రి వేళ దైవ ప్రవక్త(స) హజ్రత్ అలీ(రజి) గారిని తన పడక మీద పడుకుని, తన ఆకుపచ్చ దుప్పటిని కప్పుకొమ్మని ఆజ్ఞాపించారు. తరువాత దైవప్రవక్త(స) బయటికి వచ్చి నేల మీద మన్ను కొంచెం చేతిలోకి తీసుకొని దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్‌ఆన్ వచనాలు పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. అల్లాహ్ వారి చూసే శక్తిని హరించాడు. ఆ తరువాత హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇంటికి వెళ్ళి అక్కణ్ణుంచి "యమన్" దిశలో వున్న "సౌర్" గుహ వైపునకు ఆ రాత్రే బయలుదేరారు.

అవిశ్వాసులు బయట ఊపిరి బిగబట్టి దైవప్రవక్త (స) కోసం ఎదురు చూస్తున్నారు. అర్ధరాత్రి దాటిపోయింది. వారి ఆరాటం ఎక్కువయ్యింది. ఇక ఉండబట్టలేక చిన్నగా తలుపు సందు నుంచి లోపలికి తొంగిచూశారు. పడక మీద పడుకొని వున్న హజ్రత్ అలీ(రజి) ని చూసి ప్రవక్త(స) గారని భ్రమించారు. ఉదయం ప్రవక్త పడకమీద దుప్పటి తొలగించుకుంటూ వున్న హజ్రత్ అలీ(రజి) ని చూసిన శత్రువులు నిర్ఘాంతపోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వారి పథకం తల్లకిందులైపోయింది.

తెల్లవారాక తమ కోసం శత్రువులు నలుప్రక్కలా గాలిస్తారని గ్రహించిన ప్రవక్త(స) మామూలు మార్గాన్ని వదలి మక్కా దక్షిణ దిశగా వున్న మార్గం గుండా కాలి నడకన ఆయన మరియు హజ్రత్ అబూబక్ర్ (రజి) "సౌర్" గుహకి చేరుకున్నారు. ఈ మార్గం దట్టమైన పొదలతో, రాళ్ళతో కూడిన కఠినమైన మార్గం గనక కొండరాగానే ప్రవక్త(స) ను తన భుజాలపై ఎత్తుకున్నారు హజ్రత్ అబూబక్ర్ (రజి). చివరికి సౌర్ గుహకి చేరుకున్నాక, హజ్రత్ అబూ బక్ర్ (రజి) గుహలోకి ప్రవేశించి రాళ్ళు, ముళ్ళూ తీసేసి నేల శుభ్రం చేశారు. అక్కడ కన్నాలు ఉంటే గుడ్డపేలికలు చుట్టి వాటిలో పెట్టి ప్రవక్త(స) గారిని గుహలోపలికి ఆహ్వానించారు. వాళ్ళిద్దరూ ఆ గుహలో మూడు రాత్రులు గడిపారు. అబూ బకర్ కొడుకు అబ్దుల్లాహ్ రాత్రంతా వారిద్దరితో గడిపి ఉదయాన్నే మక్కాకు వెళ్ళేవారు. అక్కడ ఖురైషీయులు ప్రవక్త(స) కు వ్యతిరేకంగా ఏమేమి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రి పూట మళ్ళీ వచ్చి సమాచారం అందజేసేవారు. అబూబకర్(రజి) సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైరా మేకలు మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు. వారిద్దరికి పాలు తాపించేవాడు. అలాగే అబ్దుల్లాహ్ (రజి) గుహ దగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు వారి అడుగుజాడలు గుర్తించడానికి వీలు లేకుండా ఉండేందుకు ఆయన వెనక ఆమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.